విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 99 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 1 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## ఇక మనం పోటీదారులం కాదు, భాగస్వాములం...

### ఎస్‌సీవో వేదికగా స్పష్టం చేసిన మోదీ, జిన్‌పింగ్

- సమస్యను సహేతుకంగా తేల్చుకుందాం
- సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు
- ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంచుకుందాం
- శత్రువుల్లా కాదు.. అభివృద్ధి భాగస్వాములుగా రాజకీయ, వ్యూహాత్మక కోణంలో సాగుదాం
- ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిర్ణయం
- డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలి: జిన్‌పింగ్
- వచ్చే ఏడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సదస్సుకు రావాలని జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం
- బ్రిక్స్ అధ్యక్షత కోసం భారత్‌కు జిన్‌పింగ్ మద్దతు



భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలకు సహేతుకమైన, పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారం కనుగొనేందుకు కృషి చేయాలని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిర్ణయానికి వచ్చారు. ఇరుదేశాల వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై అంగీకారానికి వచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అస్థిరత నెలకొన్న సమయంలో మోదీ, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్యంపై ప్రత్యేకంగా చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లిన ప్రధాని మోదీ.. ఆదివారం జిన్‌పింగ్‌తో భేటీ అయి చర్చించారు. మోదీ, జిన్‌పింగ్ భేటీకి సంబంధించి విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను మరింత

వివరాలు 2లో..

## మంత్రి లోకేశ్‌కు అరుదైన గౌరవం

- ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆహ్వానం
- స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని పిలుపు
- ఆహ్వాన లేఖను పంపిన ఆస్ట్రేలియన్ హైకమిషన్



రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆస్ట్రేలియా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ (ఎస్‌వీపీ)లో పాల్గొనాలని కోరుతూ ఢిల్లీలోని ఆ దేశ హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ లోకేశ్‌కు ఆహ్వాన లేఖను పంపించారు. మానవ వనరులు, సాంకేతికత, ఆర్థికాభివృద్ధిలో ఏపీ నాయకత్వాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు. 2001లో నరేంద్రమోదీ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారని పేర్కొన్నారు. "విద్యారంగంలో నిర్మాణాత్మక సంస్కరణలతో ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు లోకేశ్ శ్రీకారం చుట్టి అరుదైన గౌరవం సాధించారు. ఎస్‌వీపీలో పాల్గొనడంతో కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం లభిస్తుంది. తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యాలు, విద్యానైపుణ్యం, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది" అని లోకేశ్ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.

## జగన్‌కు సుదర్శన్ రెడ్డి ఫోన్..

- ఉపరాష్ట్రపతి ఎన్నికలు
- మద్దతు కోరిన విపక్ష అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి
- ఎన్డీయే నాయకులకు ముందే మాట ఇచ్చేశానన్న జగన్



వివరాలు 2లో..

## బీసీ బిల్లులకు జై

### 42% రిజర్వేషన్ బిల్లులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

### మరో మూడింటికి సైతం..




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50% రిజర్వేషన్ల పరిమితి నిబంధనను ఎత్తివేస్తూ.. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పురపాలక చట్ట సవరణ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు రాష్ట్ర శాసనసభ

వివరాలు 2లో..

## పోలవరం పనుల తీరుపై సంతృప్తి

### ముగిసిన విదేశీ నిపుణుల బృందం సమీక్ష



పోలవరం ప్రాజెక్టులో బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని విదేశీ నిపుణుల బృందం వ్యాఖ్యానించింది. వానాకాలంలో పనులు బాగా చేశారని ప్రశంసించింది. 'నాలుగో పర్యటన సమయంలో డ్యాం నిర్మాణ ప్రాంతంలో అంతా సీపేజీ నీరే ఉంది. రెండు నెలల్లో ఆ నీరంతా తోడి, నిర్మాణ క్షేత్రాన్ని సరైన స్థితిలోకి తీసుకువచ్చి పనులు చేయగలుగుతారని మేం భావించలేదు. అందుకు విరుద్ధంగా అంతా చక్కగా చేశారు. పనులు సంతృప్తికరంగా ఉన్నాయి.

వివరాలు 2లో..

## నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు

- వేర్వేరు జిల్లాల్లో 9 మంది దుర్మరణం
- నరసాపురంలో ట్రాక్టర్ ఢీకొని నలుగురు..
- పాడేరులో స్కార్పియో ఢీకొని ఇద్దరు..
- నెల్లూరు జిల్లాలో ఇద్దరు, అనంతలో ఒకరు..



రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన గణేశ్ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. వాహనాలు ఢీకొని 8 మంది దుర్మరణం పాలవగా, సముద్రంలో మునిగి ఓ యువతి చనిపోయింది. వివరాలివీ.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం తూర్పుతాళ్ళు పంచాయతీ పరిధి ఈవనవారి

వివరాలు 2లో..

## కాళేశ్వరంపై రగడ

### అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

- కాళేశ్వరం నివేదికపై చర్చలో తీవ్ర గందరగోళం
- జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసిన బీఆర్ఎస్
- మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ సభ నుంచి వాకౌట్
- బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్
- నివేదిక ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ

వివరాలు 2లో..



## తాడిపత్రి గణేశ్ శోభాయాత్రలో ఉద్రిక్తత... జేసీ, కాకర్ల వర్గాల మధ్య రాళ్ల దాడి



- గణేష్ శోభాయాత్ర వేళ బయటపడ్డ విభేదాలు
- కాకర్ల వర్గీయుల గణేశ్ విగ్రహం నిదానంగా వెళుతుండడంపై జేసీ ఆగ్రహం
- వేగంగా వెళ్లాలని సూచన
- ఇరువర్గాల మధ్య ఘర్షణ

వివరాలు 2లో..

## సెప్టెంబరులోనూ... దంచి కొట్టుడే

### వరుస అల్పపీడనాలు.. విస్తారంగా వానలు



బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలతో పాటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత తొలి రెండు నెలల్లో రాష్ట్రంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురవలేదు.

వివరాలు 2లో..

# తాడిపత్రి గణేశ్ శోభాయాత్రలో ఉద్రిక్తత... జేసీ, కాకర్ల వర్గాల మధ్య రాళ్ల దాడి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో గణేశ్ శోభాయాత్ర సందర్భంగా టీడీపీ నేతలు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్ అనుచరుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు వర్గాలు పరస్పరం రాళ్లదాడి చేసుకోగా, పోలీసులు రంగంలోకి దిగి రెండు వర్గాలను చెదరగొట్టారు.

ఘటన వివరాల ప్రకారం, ఆసుపత్రిపాలెం వద్ద కాకర్ల రంగనాథ్ వర్గీయులకు చెందిన గణేశ విగ్రహం నిదానంగా వెళుతుండగా, జేసీ ప్రభాకర్‌రెడ్డి వేగంగా వెళ్లాలని సూచించారు. ఈ విషయంపై కాకర్ల రంగనాథ్ ఆగ్రహించి, ప్రభాకర్‌రెడ్డిని దూషించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం రాళ్లదాడిగా మారింది. ఈ ఘర్షణలో కాకర్ల రంగనాథ్‌కు చెందిన ఐషర్ వాహనం, లారీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చిన అనంతరం శోభాయాత్రను తిరిగి కొనసాగించారు. గత ఎన్నికల ముందు కాకర్ల రంగనాథ్ వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఎన్నికల తర్వాత జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గాల మధ్య వివాదాలు తలెత్తాయి.

# జగన్‌కు సుదర్శన్ రెడ్డి ఫోన్..

ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు వేగవంతమయ్యాయి. ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు ఫోన్ చేశారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఆయన జగన్‌ను కోరారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థనకు జగన్ సున్నితంగా బదులిచ్చారు. ఇండియా కూటమి తమ అభ్యర్థిని ప్రకటించకముందే ఎన్డీయే నాయకులు తనను సంప్రదించారని, వారికి మద్దతు ఇస్తామని మాట ఇచ్చామని జగన్ వివరించారు. ఈ కారణంగా ఇప్పుడు మీకు (సుదర్శన్ రెడ్డికి) మద్దతు ఇవ్వలేకపోతున్నామని స్పష్టం చేశారు. అయితే, న్యాయమూర్తిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దేశానికి, ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని, ఆయనపై తనకు వ్యక్తిగతంగా అపారమైన గౌరవం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో తన నిర్ణయాన్ని మరోవిధంగా భావించవద్దని జగన్ విజ్ఞప్తి చేశారు.

# కాళేశ్వరంపై రగడ

తెలంగాణ శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగిన చర్చ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కాళేశ్వరం నివేదికపై చర్చ జరుగుతున్న సమయంలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో గంటన్నర పాటు వేచి చూశామని, అయినా అవకాశం రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొందరు సభ్యులు ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. సభ లాబీల్లో భారీ సంఖ్యలో మార్షల్స్‌ను మోహరించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.అనంతరం ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా వారు తమ నిరసనను కొనసాగించారు.బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభలో కాగితాలు చించివేయడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. కాళేశ్వరం నివేదికలోని వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఇలా ప్రవర్తిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు సభా నియమాలను గౌరవించాలని ఆయన సూచించారు.

# నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు

-మొదటిపేజీ తరువాయి

మెరకలో 15 అడుగుల గణనా?థుడి విగ్రహాన్ని నరసాపురం వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేసేందుకు సాయంత్రం 5 గంటల సమయంలో ఊరేగింపు చేపట్టారు. అయితే, అక్కడి సిమెంటు రహదారి మార్జిన్ సక్రమంగా లేకపోవడంతో పాటు డ్యాన్సులు చేస్తున్న యువకుల అత్యుత్సాహంతో వినాయకుడి విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు దూసుకుపోయింది. ఈ ఘటనలో యివన సూర్యనారాయణ (58), తిరుమల నర్సింహమూర్తి (35), గురుజు మురళి (38), కడియం దినేశ్ (9) అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలై పాలకొల్లు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయామ్, అడిషనల్ ఎస్పీ భీమారావు ఘటనా స్థలానికి చేరుకుని సంఘట ప్రమాదంపై ఆరా తీశారు. అలాగే, అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు సమీప చింతలవీధి ప్రధాన రహదారిపై ఊరేగింపుగా వెళ్తున్నవారిపై స్కార్పియో కారు వేగంగా దూసుకువచ్చి ఢీకొంది. ప్రమాదంలో చింతలవీధికి చెందిన కొర్రా సీతారామ్ (61), గంట కొండబాబు (35) అక్కడికక్కడే మృతిచెందగా, కొర్రా విశ్వ, వంతాల దాలిమ్మలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమం గా ఉంది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే, నెల్లూరు జిల్లా కావలి మండలం చెన్నాయపాలెం సముద్రతీరంలో సాయంత్రం వినాయక నిమజ్జన సమయంలో పులి నాగలక్ష్మి(16) సముద్రంలో కొట్టుకుపోయి మృతి చెందింది. అలాగే, శ్రీసత్యసాయి జల్లా పెద్దిరెడ్డిపల్లి ఊరేగింపులో ట్రాక్టర్ ఢీకొని మారుతి (30) అనే వ్యక్తి మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు.

**విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఎక్కుదామనుకుంటే..**

కొండాపురం మండలం రామాంజీపురానికి చెందిన వెంగయ్య తన కుమారుడు ప్రసాద్‌తో కలిసి మోటారుబైక్‌పై కావలి తుమ్మలపెంట తీరంలో జరిగే నిమజ్జనానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కావలి సమీపంలో బైక్‌ను ఆపి.. 'నువ్వు బైక్‌లో వెళ్లి పో.. నేను వెనుక విగ్రహం వస్తున్న ట్రాక్టర్‌లో వస్తా'నని చెప్పి కుమారుడ్ని పంపించాడు. అనంతరం ట్రాక్టర్‌ను ఆపే క్రమంలో వెంగయ్యను ట్రాక్టర్ ఢీకొంది. ఆయన కాలికి తీవ్రగాయాలు కాగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

# ఇక మనం పోటీదారులం కాదు, భాగస్వాములం...

-మొదటిపేజీ తరువాయి

పెంచేందుకు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా చర్యలు తీసుకునేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాద నిర్మూలన, సహేతుక వాణిజ్యం అంశాలపై అంతర్జాతీయ వేదికలపై పరస్పర అవగాహనతో వ్యవహరించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇరుదేశాల పాత్ర కీలకమని గుర్తించారు. ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను విస్తరించడానికి రాజకీయ, వ్యూహాత్మక కోణంలో ముందుకు సాగాల్సిన అవసరంపై ప్రత్యేకంగా చర్చించారు. భారత్-చైనా శత్రువులు కాదని.. అభివృద్ధి భాగస్వాములని మోదీ, జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు వివాదాలుగా మారవద్దని పేర్కొన్నారు. ఇరుదేశాల ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి వీలుగా.. నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, వీసా ప్రక్రియ సరళతరం చేయడం, పర్యాటక వీసాల జారీ, మానస సరోవర్ యాత్ర పునః ప్రారంభం వంటి చర్యలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. ఇరు దేశాల సరిహద్దుల్లో సైన్యాలను వెనక్కితీసుకోవడం, ఉద్రిక్తలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు" అని విదేశాంగ శాఖ తెలిపింది.

**శాంతి, స్థిరత్వం ముఖ్యం: మోదీ**

భారత్-చైనా సంబంధాలు బలోపేతం కావాలంటే.. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, గౌరవం ఆధారంగా ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని వివరించారు. భారత్, చైనా వ్యూహాత్మక స్వావలంబన పొందిన దేశాలని, ఈ రెండింటి మధ్య సంబంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దని భేటీలో స్పష్టం చేశారు. భారత్, చైనా మధ్య సహకారం 280 కోట్ల మంది ప్రయోజనాలకు సంబంధించినదని.. ఇది ప్రపంచ మానవాళి సంక్షేమానికి మార్గం వేస్తుందని పేర్కొన్నారు.

**ప్రత్యర్థులం కాదు..భాగస్వాములం: జిన్‌పింగ్**

భారత్, చైనా స్నేహితులుగా ఉండటమే సరైన ఎంపిక అని.. సరిహద్దు సమస్యలు ఇరుదేశాల బంధాలను ప్రభావితం చేయవద్దని ప్రధాని మోదీతో జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరుగుపొరుగు దేశాలుగా, ఒకరి విజయానికి మరొకరు తోడ్పడే భాగస్వాములుగా ఉండాలని.. డ్రాగన్ (చైనా చిహ్నం), ఏనుగు (భారత చిహ్నం) కలసి నృత్యం చేయాలని వ్యాఖ్యానించారు. భారత్, చైనా ప్రత్యర్థులు కావని, సహకార భాగస్వాములని అభివర్ణించారు. ట్రంప్ ఏకపక్ష విధానాలను పరోక్షంగా విమర్శిస్తూ.. బహుళ ధ్రువ ప్రపంచం కోసం, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యం కోసం, ఆసియాలో, ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు భారత్, చైనా కలసి పనిచేయాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, శతాబ్దానికోసారి జరిగే మార్పులు వస్తున్నాయని చెప్పారు. కాగా, ఎస్‌ఈవోకు చైనా అధ్యక్షత వహించడం, టియాంజిన్‌లో సదస్సు నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్ ఖితో కూడా ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

**బ్రిక్స్ దేశాలపై ఆంక్షలను ఖండిస్తున్నాం: పుతిన్**

భారత్, రష్యా, చైనా సహా పది దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమికి వ్యతిరేకంగా అమెరికా చేపడుతున్న చర్యలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడ్డారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు టియాంజిన్‌కు వచ్చిన ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బ్రిక్స్ దేశాల సామాజిక ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసేలా విధిస్తున్న వివక్షాపూరిత ఆంక్షలను రష్యా, చైనా ఉమ్మడిగా ఖండిస్తున్నాయని చెప్పారు. అమెరికా ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ)లను పునర్వ్యవస్థీకరించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. కొత్త ఆర్థిక వ్యవస్థలలో నిజమైన సమానత్వం, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. కాగా, ఎస్‌ఈవో సదస్సుకు హాజరైన పుతిన్‌తో ప్రధాని మోదీ సోమవారం భేటీకానున్నారు.

# బీసీ బిల్లులకు జై

-మొదటిపేజీ తరువాయి

ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వీటితోపాటు మరో 3 బిల్లులనూ సభ ఆమోదించింది. పురపాలక చట్ట సవరణ బిల్లును శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. ఈ బిల్లులకు కాంగ్రెస్‌తోపాటు భారత రాష్ట్ర సమితి, భాజపా, మజ్లిస్, సీపీఐలు మద్దతు తెలిపాయి. అలాగే సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణపై.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ ప్రైవేట్ వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) చట్టాన్ని రద్దుచేసే బిల్లులకు సైతం సభ ఆమోదం తెలిపింది. బిల్లుల ఆమోదం సందర్భంగా సభలో పలువురు మంత్రులు, వివిధ పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడారు.

**విప్లవాత్మక నిర్ణయమిది: మంత్రి శ్రీధర్‌బాబు**

"ఏ ప్రభుత్వం చేయలేని విధంగా పురపాలకశాఖ పరిధిలోని స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలుచేయాలని సంకల్పించాం. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు లేకపోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42% కల్పించేందుకు కార్యాచరణ చేపట్టాం. ఇది విప్లవాత్మకమైన నిర్ణయం. శాస్త్రీయంగా నియమించిన కమిషన్ చేసిన సిఫార్సుల మేరకు బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని.. దీనికోసం తెలంగాణ పురపాలక చట్టం-2019 నిబంధనలను సవరించాలని నిర్ణయించాం"

**ఆ తప్పును సరిదిద్దేందుకే..: మంత్రి సీతక్క**

"గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లను 50 శాతానికి కుదిస్తూ 2018 పంచాయతీరాజ్ చట్టం తెచ్చింది. ఇలా ఏ రాష్ట్రంలోనూ లేదు. దీంతో బీసీలు తీవ్రంగా నష్టపోయారు. ఆ తప్పును సరిదిద్దేందుకు.. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గతంలో బీసీ రిజర్వేషన్లను రేవంత్‌రెడ్డి బంధువు అడ్డుకుంటున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరో కోర్టుకి వెళితే దాన్ని సీఎంకు అంటగట్టడం భావ్యంకాదు" అని మంత్రి సీతక్క అన్నారు. "రాబోయే తరాలకుకూడా మంచి చేయాలనేది మా ప్రభుత్వ ఆలోచన. రానున్నరోజుల్లో అన్నింటిలో బీసీలకు 42% రిజర్వేషన్లు రావాలి" అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

**వివాదాలు తలెత్తకుండా చూడాలి: గంగుల కమలాకర్, భారత రాష్ట్ర సమితి**

"బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మేం చేసిన సూచనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శాస్త్రీయంగా రిజర్వేషన్లు చేసిన తమిళనాడు కేంద్రం నుంచి ఆమోదం పొంది అమలు చేసుకుంటుండగా.. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు అశాస్త్రీయంగా చేయడంతో అమలు చేయలేకపోయాయి. బీసీలను మోసంచేసే ప్రయత్నం వద్దు. ఆలస్యమైనా రాజ్యాంగ సవరణతో పకడ్బందీగా బీసీ రిజర్వేషన్లు అమలుచేస్తే ఇబ్బందులు రావు"

**గవర్నర్ వెంటనే ఆమోదించాలి: కూనంనేని సాంబశివరావు, సీపీఐ**

"బీసీలకు 42% రిజర్వేషన్లు అనేది విప్లవాత్మకమైన ముందడుగు. దీనికి సీపీఐ పూర్తిగా మద్దతిస్తోంది. భాజపా, భారత రాష్ట్ర సమితినేతలు ఒకవైపు మద్దతు ఇస్తూనే పార్లమెంటులో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చకపోతే బిల్లు చట్టరూపం దాల్చదంటున్నారు. గతంలో జయలలిత పోరాటం చేయడంవల్లే రిజర్వేషన్లకు పీవీ అంగీకరించారు. ఇక్కడ అన్ని పార్టీలు కలిసి పోరాడాలి. గవర్నర్ ఈ బిల్లులను వెంటనే ఆమోదించాలి"

# సెప్టెంబరులోనూ... దంచి కొట్టుడే

-మొదటిపేజీ తరువాయి

ఆ లోటు పూడ్చేందుకు గత నెలలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. సెప్టెంబరులోనూ అదే పరిస్థితి కొనసాగుతుందని, ప్రభుత్వం అప్రమత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురిశాయి. గతంలో ద్రోణి ప్రభావంతో తేలికపాటి వర్షాలు కురిసేవి. వాతావరణ మార్పులతో వాయుగుండం తరహాలో వర్షపాతం నమోదవుతోంది.

**ఏపీ తీరం వైపే..**

ఈ నెలలో ఉత్తర కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమెరికాకు చెందిన నోవా మోడల్ అంచనా వేస్తోంది. తొలి వారంలో ఉత్తర కోస్తా, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 30 సెం.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశముందని సూచిస్తోంది. 'సాధారణంగా సెప్టెంబరులో ఏర్పడిన అల్పపీడనాలు ఒడిశా వైపు వెళ్తుంటాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో అవి దిశ మార్చుకుని ఏపీ తీరం రావచ్చు. ఈ నెలలో ఏర్పడే అల్పపీడనాలు వాయుగుండాలుగా మారతాయి. ఇవి విశాఖ పరిసరాల్లో తీరం దాటేందుకు 60 శాతం అవకాశముంది' అని విశాఖకు చెందిన వాతావరణ నిపుణుడు ఆచార్య భానుకుమార్ తెలిపారు.

**మూడు రోజుల పాటు వానలు**

రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొన్నాయి. తీరం వెంబడి గంటకు 40-60 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీయొచ్చని, బుధవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం 6 గంటల వరకు అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో 70.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**దేశవ్యాప్తంగానూ వర్షాలే..**

సెప్టెంబరులో దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) అంచనా వేసింది. నెలవారీ సగటు వర్షపాతం దీర్ఘకాలిక సగటు 137.9 మి.మీ. కంటే 109 శాతం అధికంగా ఉంటుందని తెలిపింది. ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు ముంచెత్తడం, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు.

# పోలవరం పనుల తీరుపై సంతృప్తి

-మొదటిపేజీ తరువాయి

ఇలాగే సాగితే మార్చి నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తిచేయడం సులభమే' అని విదేశీ నిపుణులు పేర్కొన్నారు. బట్రస్ డ్యాం నిర్మించాలని విదేశీ నిపుణుల బృందం ఇచ్చిన సలహా తమకు ఎంతో ఉపయోగపడిందని, అందువల్లే వానాకాలంలో, వరద సీజన్‌లో ఎలాంటి సమస్య రాకుండా పనులు చేయగలిగామని పోలవరం అధికారులు ఆ బృందానికి తెలియజేశారు.విదేశీ నిపుణుల బృందం మూడోరోజు సమీక్ష రాజమహేంద్రవరంలో నిర్వహించారు. మూడోపక్ష ల్యాబ్ కూడా చక్కగా ఏర్పాటుచేశారని, అందులో పరికరాలు బాగున్నాయని ఆ బృందం పేర్కొంది. ఈ సమావేశంలో నిపుణులు డిసిస్కో, రిచర్డ్ డొన్నెల్లీ, డేవిడ్ పాల్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు పోలవరం అథారిటీ కార్యదర్శి రఘురామ్, కేంద్ర జలశక్తి శాఖ డిప్యూటీ కమిషనర్ గౌరవ్ సింఘాల్, కేంద్ర జలసంఘం సీఈ బక్షి, మరో సీఈ రమేష్‌బాబు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**డీప్ సాయిల్ మిక్సింగ్ మెథడాలజీకి ఓకే**

పోలవరం ప్రాజెక్టులో భారీ వరదల వల్ల నేల స్వభావం మారిపోయింది. అక్కడ డీప్ సాయిల్ మిక్సింగ్ చేయాలి. ఆ మెథడాలజీకి విదేశీ నిపుణుల బృందం సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. అయితే మరో విధానాన్ని కూడా ఒక నిపుణుడు ప్రతిపాదించి అందులోని లాభనష్టాలు అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. దాదాపు 550 మీటర్ల మేర డీప్ సాయిల్ మిక్సింగ్ చేయాల్సి ఉంటుంది. 12 నుంచి 16 మీటర్ల లోతు వరకు చేయాలి. వైబ్రో కాంపాక్షన్ పనులకు సంబంధించి తిరుపతి ఐఐటీ చేసిన అన్ని పరీక్షల ఫలితాలు సమర్పించారు. తాము అధ్యయనం చేసిన తర్వాత అభిప్రాయాలు తెలియజేస్తామని విదేశీ నిపుణులు పేర్కొన్నారు.

# తాడిపత్రిలోకి పెద్దారెడ్డి ఎంట్రీ వేళ కీలక పరిణామాలు..



**తాడిపత్రి, పెన్ సత్తా ఆగస్టు 31:** తాడిపత్రి రాజకీయం ఉత్కంఠ పెంచు తోంది. ఎలాగైనా తాడిపత్రి లోకి ప్రవేశించాలని పెద్దారెడ్డి, అసలు అవకాశమే లేదంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి పంతం పట్టారు. పెద్దారెడ్డి తాడిపత్రి ప్రవేశం అంశం న్యాయస్థానాలకు చేరింది. తాజాగా సుప్రీం కోర్టు పెద్దారెడ్డికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో, తాడిపత్రి లోకి పోలీసు బందోబస్తుతో వెళ్లేందుకు పెద్దారెడ్డి సిద్దమయ్యారు. ఇదే సమయం లో జేసీ వర్గం అప్రమత్తం అయింది. ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలతో పోలీసులు అలర్ట్ అయ్యారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో అడుగు పెట్టేందుకు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. సుప్రీం ఆదేశాలు ఉండటంతో ఇప్పుడే ఎలాగైనా తాడిపత్రి లోకి వెళ్లాలని తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. సుప్రీం ఆదేశాల మేరకు తనకు అనుమతి ఇవ్వాలని పోలీసు అధికారులను కోరుతున్నారు. వైసీపీ ఎన్నికల్లో ఓడిన నాటి నుంచి పెద్దారెడ్డికి తాడిపత్రిలోకి వెళ్లేందుకు అవకాశం లభించ లేదు. పెద్దారెడ్డి తాడిపత్రి లోకి రావటానికి జేసీ ప్రభాకర్ రెడ్డి ససేమిరా అంటున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా పెద్దారెడ్డి ని పోలీసులు అనుమతించటం లేదు. కాగా, పెద్దారెడ్డి తొలుత హైకోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నారు . అదే సమయంలో జేసీ ప్రభాకర్ రెడ్డి మరో కార్యక్రమం నిర్వహించారు. దీంతో, ఈ వ్యవహారం హైకోర్టు డివిజన్ బెంచ్ కు వెళ్లింది. అక్కడ ఆదేశాలు తనకు అనుకూలంగా లేకపోవటంతో పెద్దారెడ్డి సుప్రీంకు వెళ్లారు. సుప్రీం కోర్టు లో విచారణ తరువాత పెద్దారెడ్డి తాడిపత్రి కి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. సుప్రీం ఆదేశాలతో పెద్దారెడ్డి సోమ, మంగళవారాల్లో తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే ఆయన బాధితులే అడ్డుకుంటారని వ్యాఖ్యానించారు. తాడిపత్రికి మంచి చేశాం కాబట్టే 40 ఏళ్లుగా ప్రజలు తమ కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్నారని, గత ప్రభుత్వంలో చేసిన అరాచకాల పై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని జేసీ ప్రభాకర్ రెడ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అటు కోర్టు ఉత్తర్వులు, ఇటు స్థానిక పరిస్థితులతో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# కలెక్టరేట్ నిర్మాణం పై డిప్యూటీ స్పీకర్ కీలక వ్యాఖ్యలు



**భీమవరం, పెన్ సత్తా, ఆగస్టు 31:** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ నిర్మాణం పై ఏపీ డిప్యూటీ స్పీకర్ కె. రఘురామ కృష్ణ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రహదారి పై నిలబడి భీమవరం బోర్డు, పెదఅమిరం లోని స్థలాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు వేలు పెట్టి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు రాజధానులు కట్టాలన్న వాళ్లు అఖిలపక్ష సమావేశమని రాద్ధాంతం చేశారంటూ మండి పడ్డారు. ఏడాదిన్నరగా దీని గురించి మాట్లాడిన వారు లేరన్నారు. రెండు లక్షల నలభై వేల ఎస్ఎఫ్‌టీతో అన్ని ఆఫీసులు ఉండేలా ప్లాన్ సైతం తాను ప్రభుత్వానికి సమర్పించానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అన్ని నియోజకవర్గాలకు ఈ స్థలం ఉత్తమంగా ఉందని ప్రపోజల్ ఇచ్చామని చెప్పారు. దీని పై వైసీపీ వాళ్లు మీటింగ్ పెట్టి ఆందోళన చేస్తామని నిర్ణయించారని పేర్కొన్నారు. మీరు మూడు రాజధానులు అన్నారు. కానీ తాము ఒకే రాజధాని అని ప్రకటించామని తెలిపారు. అబద్ధాలు చెప్పి రుషి కొండ కొట్టేసి ప్యాలెస్ కట్టారని వ్యంగ్యంగా అన్నారు. రాజధాని రుషికొండ లోనే ఉండాలి, ముఖ్యమంత్రి అందులోనే ఉండాలని ఆందోళన చేసుకోండంటూ వైసీపీ నేతలకు చురకలంటించారు. భీమవరంలో స్థలం లేదని జిల్లా పార్టీ ఆఫీసు ఉండిలో కట్టారా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగింది. అందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా భీమవరం ఏర్పాటు అయింది. దీంతో భీమవరంలో ఇంటిగ్రేటెడ కలెక్టరేట్ నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అందు కోసం మార్కెట్ యార్డ్ స్థలాన్ని కూడా కేటాయించింది. ఆ సమయంలో పనులు ప్రారంభం కాలేదు. ఇంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారిపోవడం చకచక జరిగిపోయాయి. ప్రస్తుతం చంద్రబాబు సారథ్యం లోని కూటమి ప్రభుత్వం పెదఅమిరంలో పరిధిలో కలెక్టరేట్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందుకు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు సంపూర్ణ సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమయ్యారు. అయితే భీమవరం నుంచి కలెక్టరేట్ ను తరలిస్తే ఒప్పుకునేది లేదని ఏపీ శాసన మండలి చైర్మన్ కె. మోషేన్ రాజు హెచ్చరించారు. దీంతో జిల్లా కలెక్టరేట్ వివాదం రాజుకొంది. జిల్లాకు పరిపాలన భవనం లేదు. అన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

## అల్లు కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ పరామర్శ



**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను వారి నివాసంలో పరామర్శించారు. అల్లు అరవింద్ తల్లి అల్లు కనకరత్నం అనారోగ్యంతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా వారి ఇంటికి వెళ్లి అల్లు కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. నిన్న అల్లు కనకరత్నం భౌతికకాయానికి పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా నివాళులు అర్పించారు.

## నిరసనలకు దిగివచ్చిన ఇండోనేషియా ప్రభుత్వం



**జకార్తా :** ఎంపిల అలవెన్సుల పెంపుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున చెలరేగిన నిరసనలకు ఇండోనేషియా ప్రభుత్వం దిగివచ్చింది. పార్లమెంటేరియన్లకు అలవెన్సులు, అధికారాలను రద్దు చేయడానికి అంగీకరించినట్లు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆదివారం తెలిపారు. అధ్యక్ష భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సభ్యుల అలవెన్సు పెంపు, విదేశీ పని పర్యటనల పై తాత్కాలిక నిషేధం వంటి పలు అంశాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం, వ్యక్తుల నివాసాలను, ఆర్థిక కేంద్రాలను దోచుకోవడం వంటి వాటిపై కఠినచర్యలు తీసుకోవాలని సైన్యం, పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని చర్యలు దేశద్రోహం, ఉగ్రవాదం లను సూచిస్తున్నాయని అన్నారు. ఆగ్నేయాసియా దేశాల్లో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన దేశం ఇండోనేషియా. గత అక్టోబర్‌లో అధికారం చేపట్టిన ప్రబోవో సబియాంటో ఆర్థికవ్యవస్థ కుదేలయిందని ప్రకటించారు. పేదల సంక్షేమానికి కోత పెడుతూ మరో వైపు 580 మంది పార్లమెంట్ సభ్యుల గృహ అలవెన్సులను 50 లక్షల రూపియాలకు (రూ.35,000లకు) పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఎంపిలు తీసుకుంటున్న నెలవారీ జీతం కోటి రూపాయలకు ఇది అదనం. సామాన్య పౌరుడి సగటు ఆదాయం కన్నా ఎంపిల గృహ అలవెన్సు 20 రెట్లు ఎక్కువ.

ప్రభుత్వ ప్రకటనకు వ్యతిరేకంగా విద్యార్థులు, పౌర సంఘాలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. సోమవారం చేపట్టిన ఆందోళనలు గురువారం వరకు కొనసాగాయి. అయితే గురువారం నిరసన స్థలంలో పోలీసుల కాల్పుల్లో మోటార్ సైకిల్ రైడ్‌షేర్ డ్రైవర్ మరణించడంతో ఆందోళన హింసాత్మకంగా మారింది. నిరసనకారులు కొంతమంది రాజకీయ నేతల ఇళ్లు, ప్రభుత్వ సంస్థలకు నిప్పు పెట్టడంతో పాటు దోచుకున్నారు. నిరసనకారుల పై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే.

## బ్రిక్స్ దేశాల పై అమెరికా టారిఫ్‌లను ఖండించిన రష్యా, చైనాలు



**చైనా:** బ్రిక్స్ దేశాల పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్ లను రష్యా, చైనాలు తీవ్రంగా ఖండించాయి. బ్రిక్స్ సభ్య దేశాలు, ప్రపంచం మొత్తం మీద సామాజిక ఆర్థిక అభివృద్ధిని అడ్డుకునే వివక్షతతో కూడిన ఆంక్షలకు వ్యతిరేకంగా రష్యా, చైనాలు ఉమ్మడి వైఖరిని తీసుకుంటాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. షాంఘై కో ఆపరేషన్ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ టియాంజిన్ చేరుకున్న సంగతి తెలిసిందే. చైనా మీడియా జిన్హువా మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం అదనపు వనరులను సమీకరించడం పై రష్యా, చైనా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయని ప్రపంచ సవాళ్లను ఎదుర్కొవడంలో బ్రిక్స్ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఐక్యంగా ఉన్నాయని అన్నారు. బ్రిక్స్ దేశాల పై ట్రంప్ పదిశాతం సుంకాలను విధించిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. పుతిన్ మాట్లాడుతూ రష్యా, చైనా అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంక్ సంస్కరణలకు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. బహిరంగ, నిజమైన సమానత్వం సూత్రాల పై కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలనే అభిప్రాయాన్ని ఇరుదేశాలు పంచుకుంటాయని, ఇది అన్ని దేశాల అభివృద్ధికి సమానంగా మరియు వివక్షత లేని అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సభ్యదేశాల వాస్తవ స్థితిని ప్రతిబింబిస్తుందని అన్నారు. సమస్త మానవాళికి ప్రయోజనం చేకూరేలా తాము పురోగతిని కోరుకుంటున్నామని,రష్యా, చైనాలు ఈ గొప్ప లక్ష్యం వైపు కలిసి పనిచేయడం కొనసాగిస్తాయని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. ఇరు దేశాల పురోగతిని నిర్ధారించడానికి మన ప్రయత్నాలను ప్రారంభిస్తామని అన్నారు. ఎస్‌సిఒ సదస్సుకు హాజరుకావడం, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో చర్చలు జరపడంతో పాటు రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ పై విజయపు 80 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చైనా నిర్వహించే వి.పరేడ్‌లో పాల్గొననున్నారు.

# టిఎంసి ఎంపి మహువా మొయిత్రా పై ఎఫ్ఐఆర్



**రాయ్‌పూర్ ఆగస్టు 31 :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా పై ఛత్తీస్‌గఢ్ లోని రాయ్‌పూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక నివాసి గోపాల్ సమంటో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, శనివారం మానా పోలీస్ స్టేషన్‌లో మెయిత్రా పై బిఆర్ఎస్ (బిఆర్ఎస్) సెక్షన్లు 196,197 ల కింద కేసు నమోదు చేసినట్లు ఒక అధికారి పేర్కొన్నారు. గత గురువారం పశ్చిమబెంగాల్ లోని నాడియా జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో మహు వా మొయిత్రా మాట్లాడుతూ సరిహద్దు భద్రత పై మోదీ ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆ కార్యక్రమంలో ఆమె అమిత్ షా పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని గోపాల్ సమంటో ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. 1971 లో రాయ్‌పూర్ లోని మానా క్యాంప్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ శరణార్థులు స్థిరపడ్డారని, మొయిత్రా ప్రకటన వారిలో భయాన్ని సృష్టించిందని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఆ శరణార్థుల పై ఇతర వర్గాల్లో ఆగ్రహాన్ని రేకెత్తించే అవకాశం ఉందని అన్నారు.

# లిక్కర్ కేసులో జైలుకు పోవటం ఖాయం..



**గోనె ప్రకాష్ రావు సంచలన ప్రెస్‌మీట్‌తెలంగాణ, ఆగస్టు 31:** సెప్టెంబర్ నెల చివరి వారంలోపు వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి అరెస్టు కావడం ఖాయం అని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు అన్నారు. ఇప్పటికే జగన్ పైన ఉన్న సి.బి.ఐ కేసులో ఫైన్ మాత్రమే పడే అవకాశం ఉందని, అయితే లిక్కర్ కేసులో మాత్రం ఆయన జైలుకు పోవటం ఖాయమని చెప్పారు. సెప్టెంబర్ నెల చివరి వారం లోపు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అరెస్టు కావడం ఖాయం అని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు అన్నారు. ఇప్పటికే జగన్ పైన ఉన్న సి.బి.ఐ కేసులో ఫైన్ మాత్రమే పడే అవకాశం ఉందని, అయితే లిక్కర్ కేసులో మాత్రం ఆయన జైలుకు పోవటం ఖాయమని చెప్పారు. జగన్‌కు చెందిన బెంగళూరు, హైదరాబాద్, తాడేపల్లి, పులివేందుల ప్యాలెస్‌లలో దాడులు చేస్తే వేల కోట్ల రూపాయల డబ్బులు, బంగారం దొరుకుతుందని అన్నారు. సి.బి.ఐ కేసులో జగన్ బెయిల్ కోసం తానే కాంగ్రెస్ అధిష్టానంతో సయోధ్య నడిపానని, ఎట్టి పరిస్థితి లోనూ మత పార్టీకి మద్దతు ఇవ్వను అని మాట ఇచ్చాకే జగన్ బెయిల్ పొందాడని గోనె వెల్లడించారు. అయితే 2014 నుంచి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం, కేసులకు భయపడే బీజేపీ కి జగన్ మద్దతు ఇస్తున్నాడన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ ను ప్రధాని మోదీ కానీ, బీజేపీ అగ్ర నాయకత్వం కానీ మద్దతు కోరలేదని, వీరే మద్దతు కోరినట్టు ప్రచారం చేసుకుని సపోర్టు చేస్తున్నారని విమర్శించారు. శ్రీలక్ష్మీ విషయంలో భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడటం దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగనట్టు ఉందని దుయ్యబట్టారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మీరే నిజాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువాలని భూమన కరుణాకర్ రెడ్డి ని చేతులెత్తి దండం పట్టి అడుగుతున్నాన్నారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ టి.డి.ఆర్ బాండ్ల కేసు పై దృష్టి పెట్టాలని, టి.డి.ఆర్ బాండ్ల స్కామ్ బాధ్యుల ఆస్తులను సీజ్ చేసి, ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుండి ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, పెన్ సత్తా, ఆగస్టు 31: అనారోగ్యం (జ్వరం) నుంచి కోలుకున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం నుండి ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ప్రకటనలో తెలిపింది. వారం రోజుల క్రితం టైఫాయిడ్ జ్వరం రావటంతో వైద్య చికిత్స పొందిన యార్లగడ్డ వైద్యుల సూచనల మేరకు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకున్నారు. జ్వరం నుంచి పూర్తిగా కోలుకోవడంతో సోమవారం నుండి ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. కాగా తమ అభిమాన నాయకుడు అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలని నియోజకవర్గం లోని పలు ఆలయాల్లో టిడిపి కార్యకర్తలు అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన ఆరోగ్యం కుదుటపడాలని పూజలు చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వెంకట్రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మంత్రులు

**తెనాలి, పెన్ సత్తా, ఆగస్టు 31:**కూటమి ప్రభుత్వము ఆధ్వర్యంలో తెనాలి మండలం లోని నంది వెలుగు గ్రామంలో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ ఆధారిత "స్మార్ట్" రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తో కలిసి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ
భారత దేశంలో ఎక్కడా లేని విధంగా స్మార్ట్ కార్డులను ఆంధ్రప్రదేశ్ లో మొట్ట మొదటిసారిగా అమలు లోకి తీసుకొస్తున్నాం అన్నారు. అలాగే పెన్షన్లు రూ. 4 వేలను అందించడం అనేది యావత్ దేశంలో ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతుందన్నారు. దేశంలో ఆఖరికి అగ్రగామిగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా నెలకు పెన్షన్ రూ. 2000 లను మాత్రమే అందజేస్తున్నారన్నారు.
తల్లికి వందనం ద్వారా ఒకే రోజున రూ. పదివేల కోట్లను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి దక్కుతుంది. అన్నదాత సుఖీభవ ద్వారా దాదాపు రూ. 3,175 వేల కోట్లకు పైగా నగదు రైతులకు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది. వీటికి తోడు అభివృద్ధి ఎక్కడా ఆగకుండా అమరావతి గాని, పోలవరం గాని, రాష్ట్రంలో రోడ్లు మరమ్మతులు, నిర్మాణాలు గానీ చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందన్నారు.



ఎన్నికలకు ముందు మేము నందివెలుగు లోకి రావాలంటే ఎంత ఇబ్బంది పడ్డామో మాకు, మనోహర్ కి బాగా తెలుసు. కానీ ఇవాళ రోడ్లు ఎలా ఉన్నాయనేది ఒకసారి అందరూ గమనించాలి. ఇలా అన్ని వర్గాలను మెప్పిస్తున్న ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం. గ్రామ స్వరాజ్యం సాధించిన నాడే నిజమైన స్వరాజ్యం సాధించినట్లు అన్నది ఈ ప్రభుత్వం నిజం చేస్తుంది. జరుగుతున్న అభివృద్ధిని గమనించి ఎవరైతే మీకు న్యాయం చేయగలరో, ఏ ప్రభుత్వం మీకు అండగా ఉండగలదో మీరే సరి అయిన నిర్ణయించు కుంటారని కోరుకుంటున్నాము అని పెమ్మసాని అన్నారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు న్యాయం జరగడంలో సబ్ కలెక్టర్ సింహా ప్రతి అంశం లోను తోడుగా ఉండి పనిచేసి బీమా నగదు రావడంలో పూర్తిగా సహకరించారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి 46 లక్షల మందికి స్మార్ట్ కార్డ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. తద్వారా రాష్ట్రం లోనే నాలుగు కోట్ల మందికి పైగా ప్రజలకు రేషన్ కార్డు సేవలు అందుబాటు లోకి వస్తున్నాయి అన్నారు. కూటమి ప్రభుత్వ నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వాలు ప్రజలతో సంక్షేమ పథకాలు పుష్కలంగా అందుతున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెన్షన్లను ప్రజలు అందిస్తున్నాము. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం అందరికీ సిలిండర్ల సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# పాలకుల పనితనాన్ని,కష్టాన్ని ప్రజలకు తెలియచేయడం మన బాధ్యత ప్రత్తిపాటి

- చంద్రబాబు, లోకేశ్ ప్రజలకోసం రాష్ట్రంకోసం కష్టపడుతున్నారు ప్రత్తిపాటి
- కూటమి వున్నంతవరకు మరో పార్టీ మనుగడ సాగించలేదు ప్రత్తిపాటి.

**యడ్లపాడు, పెన్ సత్తా, ఆగస్టు 31:** 4 అంటే ఆర్థికసాయం చేయడం కాదు, సంపన్నులు తమ ఆలోచనలు, విధానాలు ప్రజలతో పంచుకోవడం అన్నారు ప్రత్తిపాటి. సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుల బోనస్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి. యడ్లపాడు సంగం డెయిరీ పరిధి లోని పాల ఉత్పత్తి దారులకు డెయిరీ తరుపున అందించే బోనస్ పంపిణీ ప్రారంభించిన ప్రత్తిపాటి, స్వయంగా నగదు చెక్కుల్ని లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తుల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తల్లికి వందనం, స్త్రీశక్తి పథకాలతో కూటమి ప్రభుత్వం మహిళల మనసులు గెలిచిందని, ఇప్పటికీ పథకం లబ్ధి తమకు అందలేదనే అర్హులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చంద్రబాబు 15 నెలల్లో చేసిన మంచిని ప్రజలు గమనించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అధికారపు అహంకారంతో జగన్ ఏ ముఖ్యమంత్రి చేయనన్ని తప్పులు చేశాడన్నారు.
జగన్ అధికారం దక్కిందన్న అహంకారంతో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని తప్పులు చేశాడని, ఆఖరికి రైతుల భూముల్ని కూడా కాజేయడానికి సిద్ధమయ్యాడన్నారు. కేవలం ప్రజల ఆస్తులు, భూములు కొట్టేయడానికి ఆయన తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను అధికారం లోకి రాగానే చంద్రబాబు రద్దుచేశారన్నారు. పదిమందికి సాయపడిన వారి గురించి, సాయం పొందిన వారితో పాటు ప్రజలు పదికాలాల పాటు చెప్పుకుంటారని, ముఖ్యమంత్రి ఒక మంచి ఆలోచనతో ప్రవేశపెట్టిన పీ-4 పథకంలో సంపన్నులు భాగస్వాములు కావాలని మాజీమంత్రి పిలుపునిచ్చారు. పేదకుటుంబాలను ఆదుకోవడమంటే కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, మంచిఆలోచనలు.. మంచి విధానాలు నలుగురికి తెలియచేసి, వారి జీవితాలను



బాగుచేయడం కూడా పీ-4 కిందికే వస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. కూటమిప్రభుత్వ పనితీరు, చంద్రబాబు, లోకేష్ లు ప్రజలు, రాష్ట్రం కోసం పడుతున్న కష్టాన్ని టీడీపీ శ్రేణులు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని, పాలకుల కష్టం ప్రజలకు తెలిస్తేనే వారుకూడా బాధ్యతాయుతంగా నడుచుకుంటారని ప్రత్తిపాటి పునరుద్ఘాటించారు. జగన్ తన దోపిడీతో పూర్తిగా అగాథం లోకి నెట్టిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు తిరిగి నిలబెట్టాడని, ఆయన చేస్తున్న మంచి, అభివృద్ధిని ప్రజలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఉన్నంత కాలం రాష్ట్రంలో మరే పార్టీ మనుగడ సాగించలేదన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పదవికంటే ఒక గ్రామ నాయకుడిగా ఊరి ప్రజల మన్ననలు పొందడమే కష్టమన్న ప్రత్తిపాటి. తమ పనితీరుతో గ్రామం లోని అన్నివర్గాల ప్రజల్ని మెప్పించడం అంత తేలికైన విషయం కాదన్నారు.
నరేంద్ర నాయకత్వంలో పాల ఉత్పత్తిదారులు సంతోషంగా ఉన్నారు.ధూళిపాళ్ల నరేంద్ర నాయకత్వంలో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం, సంతోషం కోసం పనిచేస్తోందని, డెయిరీ యాజమాన్యం పశు పోషకులకు అన్నివేళలా అండగా ఉంటోందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పాల ఉత్పత్తి దారులకు రూ.7.84 లక్షల విలువైన బోనస్ చెక్కుల్ని ప్రత్తిపాటి స్వయంగా పంపిణీ చేశారు. పాడిరైతు బండారు గోవింద్ ఇటీవల మరణించి నందున అతని భార్య గోవిందమ్మకు సంగం డెయిరీ తరుపున రూ.60 వేలను ప్రత్తిపాటి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సమన్వయకర్త నెల్లూరి సదాశివ రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, సంఘం డెయిరీ డైరెక్టర్ పావులూరి శ్రీనివాసరావు, జిల్లా రైతు అధ్యక్షులు వీర రెడ్డి, సొసైటీ చైర్మన్ పోపూరి రాఘవయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వర రావు, పోపూరి వెంకయ్య, పోపూరి శివరాం ప్రసాద్, కణాల కొట్టిరెడ్డి, పోపూరి రామారావు, పోపూరి రత్తయ్య, కల్లూరి శ్రీరాములు, పరా హరీబాబు, పోపూరి నాగేశ్వర రావు తదితరులున్నారు.

# ఆకతాయిల భరతం పట్టేందుకు ప్రత్యేకంగా శక్తి టీమ్స్



## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్.

విజయనగరం, పెన్ సత్తా, ఆగస్టు 31:జిల్లాలో మహిళల పై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు శక్తి టీమ్స్ ను ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకు గాను ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశాలతో శక్తి టీమ్స్ ను జిల్లాలో ఏర్పాటు చేసామన్నారు. ఈ శక్తి టీమ్స్ జిల్లా లోని కళాశాలలు, ముఖ్య కూడళు ్లను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారి పై చట్టపరమైన చర్యలు చేపడుతున్నాము అన్నారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేసామని, ఒక్కొక్క బృందానికి ఎస్ఐ నాయకత్వం వహిస్తున్నారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని జిల్లా తెలిపారు. శక్తి ఎస్.ఓ.ఎస్.కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంకు చేరుకొని సమస్యలను చట్ట బద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడంతో పాటు, మహిళల మొబైల్స్ ఫోన్లలో శక్తి (ఎస్.ఓ.ఎస్) యాప్ను నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషను చేయిస్తున్నామన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరిస్తున్నామన్నారు. ఈ బృందాల పని తీరును అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. ఈ బృందాలు స్కూల్స్, కళాశాలలను సందర్శించి విద్యార్థినులు, ఉపాధ్యాయులతో శక్తి వారియర్స్ కొన్ని బృందాలను నియమిస్తున్నామన్నారు. ఈ బృందాల్లో యాక్టివ్ గా ఉండే విద్యార్థినులను లీడ్ వారియర్ గా నియమిస్తున్నామన్నారు. అంతే కాకుండా, విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం, విశ్వాసం పెంపొందించి, ఆపద సమయంలో తమను తాము రక్షించు కొనేందుకు సెల్ఫ్ డిఫెన్సు టెక్నిక్స్ ను కూడా కళాశాలలు, పాఠశాలలో నేర్పిస్తున్నామన్నారు. ఇందుకు గాను ప్రత్యేకంగా మహిళా ట్రైనర్ ని నియమించి, పిఈటి లకు కొన్ని మెళుకువలను నేర్పించి, వారి సహకారంతో విద్యార్థినులు చైతన్యపరుస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# పీజీఆర్ఎస్ మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలలో నిర్వహిస్తారు



**గుంటూరు, పెన్ సత్తా, ఆగష్టు 31:** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ను సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునన్నారు. అలాగే వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితికి సంబంధించి సమాచారం తెలుసు కోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపం లోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# తెలుగుదేశం పార్టీ అంటే గౌరవం, టిడీపి కార్యకర్తగా చాలా గర్వపడుతున్నాం.

## పార్టీలో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేందుకే ఇన్సూరెన్స్.

## కార్యకర్తకు కష్టం వస్తే ఆదుకోనే పార్టీ టిడిపి.





**అనకాపల్లి, పెన్ సత్తా, అగస్టు 31:**పట్టణం లోని టీడీపి కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత కార్యక్రమంలో పాల్గొన్న హెూమ్ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ.ఈ సందర్భంగా ముందుగా నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంపార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ఇద్దరు మరణిస్తే, ఐదు లక్షలు చొప్పున ఇద్దరికి చెక్కులు అందజేశారు. 21 మందికి, 12 లక్షల రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూగత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఏంటో తెలియదు అని వారు అన్నారు. ఏన్డియే ప్రభుత్వంలో చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలోటీడీపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పదవి విరమణ చేస్తున్న భైరా సుజాతను సత్కరించిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, పెన్ సత్తా, ఆగస్టు 31:**పట్టణం లోని ప్రత్తిపాటి గార్డెన్స్ నందు డి. ఆర్.యన్.యస్. సి.వి.ఎస్ ప్రిన్సిపాల్ గా పదవి విరమణ చేస్తున్న భైరా సుజాత సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భైర సుజాత ఇంగ్లీష్ లెక్చరర్ గా విద్యార్థులకు ఎన్నో సేవలు చేశారు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రతి విద్యార్థికి అంత్యంత అవసరం అని, వారి జీవితాలలో అత్యున్నత స్థానంలో వెళ్ళటానికి ప్రధానంగా సాఫ్టువేర్ రంగంలో ముందుకు సాగాలంటే ఇంగ్లీష్ అవసరం అన్నారు. అలాంటి ఇంగ్లీష్ బోధన చేస్తూ పదవి విరమణ చేస్తున్న భైరా సుజాత కి ప్రత్తిపాటి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలానే భైరా కుటుంబంతో తనకు ఉన్న అనుబంధం ఎప్పటికీ మరువలేనిదని, అలానే భైరా దిలీప్ తెలుగుదేశం పార్టీ గెలుపులో తన వంతు చేసిన కృషి కి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏదో విధంగా గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కందిమళ్ళ జయమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, తేళ్ల సుబ్బారావు, మైలవరపు శివానందం, బేతంచర్ల రామ కోటేశ్వరరావు, కందిమల్ల సాంబశివరావు, ముప్పాళ్ళ హనుమంతరావు, మక్కెన నరసింహారావు, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్ తదితరులున్నారు.

# శ్మశాన వాటికలో నుండే విద్యాలాయానికి, రాక పోకలు

**దేవరాపల్లి, పెన్ సత్తా, అగస్టు 31:** మండలం కలిగోట్ల పాఠశాలకు విద్యార్థిని విద్యార్థులు ఉపాద్యాలు రోజు శ్మశాన వాటికలో నుండె బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగించ వలసి వస్తుందని ఇటువంటి దుస్థితి బహుశా ఈ రాష్ట్ర లోనే వుందని, ఇటువంటి పరిస్థితి మరి ఎక్కడ ఉండదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం అయన దీని పై ఓ ప్రకటన విడుదల చేసారు. పిల్లలు రోజు వేసె ప్రతి అడుగు భయంతో నిండి పోతుందని, తెలిపారు. కలిగోట్ల జెడ్పీ హైస్కూల్ సువిశాల మైన వాతావరణంలో విద్య వెలుగులు వెదజల్లుతోందని తెలిపారు. కానీ ఇక్కడ చదివే ప్రతి విద్యార్థిని, విద్యార్థులు మనసుల్లో మాత్రం ప్రతి రోజూ ఓ భయం, ఒక ఆందోళన నిండిపోతున్నాయని తెలిపారు. ఉదయం పాఠశాలకు వెళ్లే టప్పుడు అంత భయం ఉండదు, కానీ సాయంత్రం తిరిగి వస్తున్నప్పుడు శ్మశాన వాటికలో నుండి రావాలంటే భయ భ్రాంతులకు గురి కావలసి వస్తుందని పిల్లలు అందోన చేందుతున్నారని తెలిపారు. చీకటి పడితే చుట్టూ ఎవరూ కనిపించరు. ఒక్కోసారి పక్షులు ఎగరిన శబ్దం విని పించినా గుండె గట్టిగా పట్టుకుని రావలసి వస్తుందని, పసి పిల్లలు మాటాల్లో ఆవేదన ఇంతా అంతా కాదని పేర్కొన్నారు. పిల్లలు అందరు ఒకే సారి గట్టిగా చేతులు పట్టుకుని వేగంగా నడుకుంటు వస్తున్నారని తెలిపారు. ఎవరైనా పెద్దవాళ్లు తోడుగా వస్తేనే ఊపిరి పీల్చుకుంటున్నారని తెలిపారు. తల్లి దండ్రులు




కూడా తమ పిల్లల దుస్థితిని చూసి తీవ్ర ఆవేదన చేందుతున్నారని అన్నారు. పిల్లలు చదువు కోవడానికి వెళ్ళి పసి హ్రుదయాలు భయ పడకూడ దన్నారు. వారు ఆనందంగా పాఠశాలకు వెళ్తే వారి ఆనందమే గ్రామ శ్రేయస్సు అని తెలిపారు. కానీ ఇక్కడ పరిస్థితి దానికి విరుద్ధంగా ఉందన్నారు. ఈ గ్రామంలో ఎంతో మంది మేదావులకు ఉన్నత రాజకీయాలకు పేరు గాంచిన గ్రామమని, ఇటువంటి గ్రామంలో విద్యా వెలుగులు ఉన్నత విజ్ఞానాన్ని నింపె పాఠశాలకు రహదారి సౌకర్యం కల్పించకపోవడం సభ్య సమాజానికి క్షమాపన చేప్పు కోవలసి వస్తుందని తెలిపారు. ఉన్న తాధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాద్యాయులు రాక పోకల సమస్యను పరిష్కరించాలి పిల్లల్లో భయందోళన పోగొట్టి వారి మనస్సులో అనందోత్సోవాలను నింపాలని వెంకన్న కోరారు,

# రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాప్ & ఫేస్ వాష్ కార్యక్రమం

**కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్న అనకాపల్లి జిల్లా పోలీసులు**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 31:** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ రక్షణ, భద్రతను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ స్టాప్ %ఊ% ఫేస్ వాష్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తోంది. రాత్రి వేళల్లో నిద్రలేమి కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు, జిల్లా జాతీయ రహదారుల పై ఉన్న 9 హైవే మొబైల్ టీమ్ లు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. అర్ధ రాత్రి దాటిన తర్వాత లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు నడిపే డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడగించి, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచిస్తున్నారు. అలాగే, వాహనం నడిపేటప్పుడు తమ కుటుంబ సభ్యుల భద్రత గురించి ఆలోచించి జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సలహా ఇస్తున్నారు. ఇక, ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునే బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, లైటింగ్, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేసి, విజిబుల్ పోలీసింగ్ ద్వారా రోడ్డు వినియోగ దారులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ చర్యల వల్ల ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో హైవే మొబైల్స్ ప్రతిరోజూ పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహిస్తూ, రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేస్తున్నారు.



# అనకాపల్లిలో నిలిచిపోయిన రాయగడ ఎక్స్ప్రెస్



అనకాపల్లిలో నిలిచిన రాయగడ ఎక్స్‌ప్రెస్


అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 31 : విజయనగరం స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ఆ ప్రభావం గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్ పై పడింది. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో సుమారు నాలుగు గంటలపాటు నిలిచిపోయింది. దీంతో సకాలంలో గమ్యస్థానాలకు చేరలేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం చెందారు. ఉదయం ఏడు గంటలకు అనకాపల్లి వచ్చిన గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్ 11 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరింది. దువ్వాడ, విశాఖపట్నం వరకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇక్కడ రైలు దిగేసి, రోడ్డు మార్గంలో గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ వెళ్లే ప్రయాణికులు మాత్రం రైలులోనే వుండిపోయారు.

# సీనియర్ ఐపీఎస్ కొత్తకోట పుస్తకరచయితగా మారి

సీనియర్ ఐపీఎస్ అధికారి కొత్త కోట శ్రీనివాసరెడ్డి పుస్తక రచయితగా మారారు. దాదాపు మూడు దశాబ్దాలు పోలీసు శాఖలో వివిధ హెూదాల్లో పనిచేసినకొత్త కోట శ్రీనివాసరెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీగా పనిచేస్తున్నారు. అయితే ఆయన ఇటు తనకు అప్పగించిన శాఖలో నిరంతరం బిజీగా ఉంటూనే మరొకవైపు పుస్తక రచయితగా మారడం విశేషం. తన స్వీయ అనుభవాలను కొత్త కోట శ్రీనివాసరెడ్డి "పుంజు తోక" పేరుతో ఒక పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకంలో తనకు పోలీసు శాఖలో నిర్వహించిన బాధ్యతల్లో ఎదురైన అనుభవాలను వివరించారు.

**విధినిర్వహణలో తాను ఎదుర్కొన్న...**

తాను పనిచేసిన ప్రాంతంలో ఎదురైన అనుభవాలను కూడా పుంజుతోక పుస్తకంలో వివరించారు. 1994 బ్యాచ్ కు చెందిన ఈ ఐపీఎస్ అధికారి కొత్త కోట శ్రీనివాసరెడ్డి విధినిర్వహణలో తాను ఎదుర్కొన్న వింత అనుభవాలను కూడా ఈ పుంజుతోక పుస్తకంలో తెలిపారు. ఆయన ఒకవైపు పోలీసు శాఖలో వివిధ పనుల్లో తలమునకలై ఉన్నప్పటికీ పుస్తక




రచయితగా మారి ఆయన తన అనుభవాలను ఇందులో వివరించారు. సమాజంలో నెలకొన్న రుగ్మతలతో పాటు మానవ సంబంధాలపట్ల స్పందిస్తూ ఆయన పుస్తకాన్ని ప్రజల ముందుకు తెచ్చారు.

**అన్ని రకాల అంశాలను...**

"పుంజు తోక" పుస్తకంలో అన్ని రకాల రసాలను ఆవిష్కరించారు. హాస్యం, బీభత్స, కరుణ, అద్భుత, రౌద్ర, శాంత, వీర వంటి అంశాలను ప్రస్తావించి పుస్తక ప్రియులకు సరికొత్త అనుభవాన్ని కొత్తకోట శ్రీనివాసరెడ్డి అందించే ప్రయత్నం చేశారు. ఈ "పుంజు తోక" పుస్తకంలో 120 అంశాలపై కవితలను కూడా రచించారు. విధినిర్వహణలో శాఖలోనే కాకుండా, ప్రభుత్వంలోనూ, సమాజంలోనూ మంచి పేరు తెచ్చుకున్న కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచించిన "పుంజు తోక" పుస్తకం యువ పోలీసు అధికారులకు ఒక మార్గదర్శిగా నిలుస్తుందని చెబుతున్నారు. పదునైన పదాలను ప్రయోగించి లాఠీతో పాటు పెన్ను కూడా పవర్ ఫుల్ అని నిరూపించగలిగారు. నేడు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఈ "పుంజు తోక" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు.

## చైనాలో మోదీ.. జిన్ పింగ్ తో భేటీ..

# కీలక అంశాలపై చర్చ




నేడు భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటిస్తున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత ప్రధాని మోదీ చైనా దేశంలో పర్యటిస్తున్నారు. ప్రధాని మోదీ నేడు చైనా అధినేత జిన్ పింగ్ తో సమావేశమవుతారు. రెండు దేశాల పరస్పర సంబంధాలపై చర్చిస్తారు. రెండు రోజుల పాటు చైనాలోనే ఉంటారు. షాంఘై సహకార సంస్థ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. అనంతరం చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో సమావేశమవుతారు. ఇద్దరి మధ్య రెండు దేశాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చ జరుగుతుంది.

**ట్రంప్ నిర్వాకం తర్వాత...**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ ఉత్పత్తుల ఎగుమతులపై అదనపు సుంకాలు విధించిన తర్వాత చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. చైనాతో కేవలం ఆర్థిక సంబంధాలు మాత్రమే కాకన్నుడా వాణిజ్య పరమైన ఒప్పందాలను కూడా ఇరు దేశాల నేతలు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే భారత్ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై కూడా చర్చించనున్నారు. ప్రధానంగా తూర్పు లదాఖ్ కాంట్రవర్సీ తర్వాత దెబ్బతిన్న సంబంధాలను ఇరు దేశాలు పునరుద్ధరించుకునే ఛాన్స్ కనిపిస్తుంది.

**అనేక కీలక అంశ్శాలపై...**

వీరిద్దరి భేటీలో భారత్ – చైనా సరిహద్దుల్లో శాంతిని నెలకొల్పడంతో పాటు వాణిజ్యానికి దారులు తెరవడంతో పాటు నేరుగా విమానాలను ప్రవేశపెట్టడం వంటి కీలక అంశాలపై ఇప్పటికే రెండు దేశాల మధ్య సయోధ్య కుదిరిన నేపథ్యంలో వీరిద్దరి మధ్య చర్చలు మరిన్ని కీలక అంశాలకు దారితీసే అవకాశముందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో ఇరు దేశాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణి వ్యవహరించేందుకు అవసరమైన అంశాలను ప్రధానంగా చర్చించనున్నారు. అందుకే ఈ సమావేశం కీలకమనే అందరూ భావిస్తున్నారు.

# తిరుమలకు నేడు వెళితే స్వామి వారి దర్శన సమయం ఎంతంటే?




తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. ఆదివారం అయినప్పటికీ భక్తుల రద్దీ అంతగా లేదు. గత మూడు రోజులుగా భక్తుల రద్దీ స్వల్పంగానే ఉంది. గత మూడు నెలల నుంచి తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. దర్శనానికి ఇరవై నాలుగు గంటలకు పైగానే సమయం పట్టింది. అదే సమయంలో కంపార్ట్ మెంట్లు నిండిపోయి బయట రెండు నుంచి మూడు కిలో మీటర్ల వరకూ క్యూ లైన్ విస్తరించింది. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సయితం భక్తులు ఇబ్బందులు పడకుండా, దర్శనం అందరికీ అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంది.

**భారీ వర్షాల కారణంగా...**

తిరుమలకు భక్తులు నిత్యం వస్తుంటారు. కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా బాలాజీ దర్శన్ కోసం దేశ వ్యాప్తంగా భక్తులు తిరుమలకు చేరుకుంటారు. అయితే ఇటీవల కాలంలో ఉత్తర భారతంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో గత మూడు రోజుల నుంచి భక్తుల రద్దీ కొంత తగ్గుతూనే ఉంది. హుండీ ఆదాయం మాత్రం తిరుమల దేవస్థానానికి ప్రతి రోజూ మూడు కోట్ల రూపాయలకు పైగానే సమకూరుతుంది. ఈ నేపథ్యంలో మళ్లీ రద్దీ పెరిగే అవకాశముందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

**హుండీ ఆదాయం...**

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని పన్నెండు కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఉచిత దర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఎనిమిది నుంచి పది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు ఐదు గంటలకు పైగానే సమయం పడుతుంది. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 77,295 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 26,779 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 3.92 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు.

# మోదీ - జెలెన్‌స్కీ ఫోన్‌కాల్.. ట్రంప్ అసహనం

: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీతో భారత ప్రధాని నరేంద్ర మోదీ జరిపిన సంభాషణ ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై భారత్ తన వైఖరిని స్పష్టం చేయడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని కల్పించింది. ఈ సంభాషణలో మోదీ శాంతియుత పరిష్కారం కోసం భారతదేశం మద్దతు ఉంటుందని మరోసారి పునరుద్ఘాటించారు. ఇది అంతర్జాతీయ వేదికపై శాంతి స్థాపనలో భారత్ తన పాత్రను గట్టిగా నిలబెట్టుకోవడానికి నిదర్శనం.వచ్చే వారం షాంఘై సహకార సంస్థ (%ాజూ%) సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీతో చర్చలు కీలకమైనవి. "రష్యా అగ్రనాయకత్వానికి సరైన సందేశం చేరేందుకు భారత్ ముందుండాలి" అని జెలెన్‌స్కీ కోరడం ద్వారా ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ ఒక విశ్వసనీయ, తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించగలదనే నమ్మకం స్పష్టమవుతుంది.




**ట్రంప్‌తో సంబంధాలు: రాజకీయ అహం, విశ్వాస లోపం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ సంబంధాలు ఇటీవలి కాలంలో క్షీణించాయి. దీనికి ప్రధాన కారణం ట్రంప్ అనుసరించిన ఏకపక్ష వైఖరి. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్-పాకిస్తాన్ మధ్య శాంతి స్థాపనలో మధ్యవర్తిత్వం వహించాలని ట్రంప్ చేసిన ప్రయత్నాలకు మోదీ సహకరించలేదు. దీనికి ప్రధాన కారణం కాశ్మీర్ వంటి వివాదాల్లో మూడో పక్షం జోక్యాన్ని భారత్ ఎప్పటికీ అంగీకరించదు అనే ప్రాథమిక సూత్రం.

ట్రంప్ పదే పదే ఫోన్ చేసినా మోదీ స్పందించకపోవడం వెనుక పలు కారణాలున్నాయి. ట్రంప్ తన స్వంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'లో భారత్-పాక్ శాంతి ప్రక్రియపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం, ట్రేడ్ డీల్‌లపై బెదిరింపులకు దిగడం వల్ల రెండు దేశాల మధ్య విశ్వాసం దెబ్బతింది. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌తో కలిసి ఫొటో దిగాలని ట్రంప్ ఆలోచన మోదీకి నచ్చలేదు. ఇది ట్రంప్ భారత-పాక్ సంబంధాలపై అవగాహన లేకపోవడాన్ని సూచిస్తుంది. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ జరగబోతోందని ట్రంప్ ముందుగానే ప్రకటించడం, భారత్‌ను ఇబ్బందులకు గురిచేసింది.ఈ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది చివర్లో భారత్‌లో జరగనున్న క్వాడ్ సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశాలు తగ్గాయని అమెరికా వర్గాలు కూడా చెబుతున్నాయి. జెఫరీస్ వంటి ఆర్థిక సంస్థలు కూడా ఇదే విషయాన్ని తమ నివేదికలో పేర్కొన్నాయి. ఈ సమస్యలన్నీ రాజకీయ అహం.. రెండు దేశాల మధ్య విశ్వాస లోపానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి.మొత్తం మీద జెలెన్‌స్కీతో మోదీ సంభాషణ శాంతి దిశగా భారత్ తీసుకుంటున్న చొరవకు నిదర్శనం కాగా ట్రంప్‌తో సంబంధాలు మాత్రం రాజకీయ అహం.. ప్రాథమిక విధానాల మధ్య ఉన్న విభేదాలను స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతి స్థాపనలో చురుకైన పాత్ర పోషిస్తున్న భారత్, మరోవైపు తన సార్వభౌమాధికారం, ప్రాథమిక విధానాలపై రాజీపడదని ట్రంప్‌కు పరోక్షంగా స్పష్టం చేసింది.ం

# అమెరికా వీసా ఫీజు పెంపు.. ట్రావెల్ ఇండస్ట్రీపై గట్టి ప్రభావం



అమెరికాకు ప్రయాణించాలనుకునే వారికి అదనపు భారం. అమెరికా ప్రభుత్వం వీసా ఫీజులను గణనీయంగా పెంచింది. ఈ కొత్త నిబంధన అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. దీని వల్ల విదేశీ ప్రయాణికులు ఇప్పుడు ఇంటెగ్రిటీ ఫీ పేరుతో అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ పెంపు ముఖ్యంగా భారత్, చైనా, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఎంత ఖర్చవుతుంది?**

ప్రస్తుతం అమెరికా వీసా ఫీజు సుమారు $192 (దాదాపు 17,000) ఉంది. కానీ, అక్టోబర్ 1 నుంచి దీనికి అదనంగా $250 (దాదాపు ?22,000) ఇంటెగ్రిటీ ఫీ జత అవుతుంది. దీంతో మొత్తం వీసా ఖర్చు $%442 (దాదాపు ?39,000) కు చేరుకుంటుంది. ఈ అదనపు ఖర్చు విద్యార్థులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు అందరికీ వర్తిస్తుంది.

**ట్రావెల్ ఇండస్ట్రీపై ప్రభావం**

ప్రయాణ ఖర్చులు ఇప్పటికే పెరిగిన నేపథ్యంలో ఈ అదనపు ఫీజు ఒక పెద్ద భారంగా మారనుంది. దీంతో చాలా మంది అమెరికా పర్యటనలను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. ఇది ట్రావెల్ ఏజెన్సీలు, ఎయిర్‌లైన్స్, హోటల్స్ వంటి రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అమెరికాకు వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గిపోతే, అక్కడి స్థానిక వ్యాపారాలు కూడా నష్టపోతాయి. ఆర్థికవేత్తల అంచనా ప్రకారం, ఈ ఫీజు పెంపు వల్ల అమెరికా పర్యాటక రంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఆర్థికవేత్తల అంచనా ప్రకారం, ఈ ఫీజు పెంపు వల్ల అమెరికా పర్యాటక రంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. పర్యాటకుల తగ్గుదల వల్ల అక్కడి ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడవచ్చు. ఈ నిర్ణయం ఎంతవరకు సరైనదో కాలమే చెప్పాలి.

# గాల్లో ఎగురుతున్న ఫ్లైట్లో టాయిలెట్ లో సమస్యలు.. సిబ్బంది తీరుకి ప్రయాణికులు అసహనం!

ఈ మధ్యకాలంలో విమాన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తరచూ విమానాల్లో పలు సమస్యలు తలెత్తుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ ఏడాది అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఎంతమందిని బలి తీసుకుందో చెప్పనక్కర్లేదు. అయితే ఈ విమాన ప్రమాదం జరిగాక పలు విమానాలు స్టార్ట్ అయ్యే ముందు వాటి కండిషన్ ఎలా ఉంది అని ముందుగానే చూసుకుంటున్నారు. కానీ ఎన్నిసార్లు టెక్నికల్ సమస్యలు రాకుండా చూసుకున్నా కూడా ఏదో ఒక మూలన విమానాల్లో సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. అయితే తాజాగా ఒక వార్త మాత్రం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విమాన ప్రయాణికులు టాయిలెట్ చేయడానికి కూడా వీల్లేకపోవడంతో చివరికి తాము తెచ్చుకున్న వాటర్ బాటిళ్లలోనే మూత్ర విసర్జన చేయాల్సి వచ్చింది. మరి ఈ ఘటన ఎక్కడ జరిగింది అనేది ఇప్పుడు చూద్దాం..




ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లడానికి.. తొందరగా గమ్యాన్ని చేరుకోవడానికి విమానాలను ఎంచుకుంటారు. అలా ఒక దేశం నుండి మరో దేశానికి గంటల్లో వెళ్తున్నారంటే అదంతా విమానాల వల్లే అని చెప్పుకోవచ్చు. కానీ అలాంటి విమానాలు ఎక్కాలంటేనే ప్రస్తుతం చాలా మంది భయపడిపోతున్నారు. ఎందుకంటే ఎప్పుడు విమానంలో ఏ సమస్య వస్తుందో తెలియడం లేదు. టెక్నికల్ సమస్యల వల్ల విమానాలు గాల్లోనే కుప్పకూలిపోతున్నాయి. దీనివల్ల ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయి కూడా. దాంతో విమాన ప్రయాణికులు గమ్యాన్ని చేరేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చుంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది..

అదేంటంటే.. వర్జిన్ ఆస్ట్రేలియా బోయింగ్ (737 %హూ%8) విమానం గురువారం నాడు మధ్యాహ్న సమయంలో బాలిలోని డెన్ పసర్ విమానాశ్రయం నుండి బ్రిస్బేన్ కి బయలు దేరింది. అయితే ఈ విమానంలోని ప్రయాణికులు గమ్యాన్ని చేరుకునే వరకు 6 గంటల సమయం పడుతుంది. అయితే విమానం స్టార్ట్ అయ్యే ముందు అన్ని సరిగానే ఉన్నాయని చూసుకున్నారు. కానీ తర్వాత సడన్గా విమానంలో సమస్యలు తలెత్తాయి..అదేంటంటే విమానంలోని ఒక టాయిలెట్ సరిగ్గా లేదని.. అందులో కొన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయని తేలింది. దాంతో మూడు గంటల పాటు విమాన ప్రయాణికులు ఒకే టాయిలెట్ ని వినియోగించుకున్నారు. అయితే ఉన్న ఆ ఒక టాయిలెట్ లో కూడా సమస్యలు ఉన్నాయని తెలియడంతో చివరికి చేసేదేమీ లేక అందులో ఉన్న వృద్ధులు,పిల్లలు, మహిళలు ఎక్కువసేపు ఆపుకోలేక చివరికి తమ వాటర్ బాటిళ్లలో మూత్ర విసర్జన చేశారు.. ఇక ఓ వృద్ధురాలు అయితే మూడు గంటల పాటు టాయిలెట్ ఆపుకోలేక చివరికి సీట్ లోనే మూత్ర విసర్జన చేసిందట. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికీ ఇది తెలిసాక చాలామంది నెటిజన్లు విమాన సిబ్బందిపై మండి పడుతున్నారు. ముఖ్యంగా ఆ విమాన ప్రయాణికులు విమాన సిబ్బందిపై మండి పడుతూ కనీసం విమానం కండిషన్ ఎలా ఉందో చూసుకోకుండానే మమ్మల్ని ఇంత దూరం ఎలా తీసుకువచ్చారని మండిపడ్డారట. తమ విమానంలో తలెత్తిన సమస్య గురించి వర్జిన్ ఆస్ట్రేలియా స్పందిస్తూ.. విమానంలో తలెత్తిన సమస్యలకు, విమాన ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేసినందుకు క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా కఠిన జాగ్రత్తలు తీసుకుంటాం. విమాన ప్రయాణికులకు ఫ్లైట్ క్రెడిట్ లు ఇస్తాము.. అంటూ చెప్పారు.అయితే ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన పై చాలా మంది జనాలు కూడా మండి పడుతున్నారు.ఆరు గంటలపాటు మనిషి టాయిలెట్ చేయకుండా ఎలా ఉంటారు. ఆ విమానంలో ఎంత మంది చిన్న పిల్లలు..వృద్ధులు.. ఆడవాళ్లు ఇబ్బందులు పడ్డారో.. ఊహించుకుంటేనే చాలా భయంకరంగా ఉంది అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# ఎక్కడ చూసినా బాబే



చంద్రబాబు కి ఒక పేరు ఉంది. ఆయన పని రాక్షసుడు అన్నది ఆయనకు అసలైన పేరు. దాన్ని రాజకీయ ప్రత్యర్థులు సైతం అంగీకరిస్తారు. బాబు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎపుడూ జనంతోనే ఉంటారు. జనంతోనే మమేకం అవుతారు. అధికారంలో ఉన్నాం కదా అని అసలు రిలాక్స్ కారు. ఆ పదం అన్నది అయన పొలిటికల్ హిస్టరీలో లేదు అనే చెప్పాలి. ఉదాహరణకు చూస్తే కనుక నాలుగవసారి ముఖ్యమంత్రి ఆయిన తరువాత బాబు తన జోరు మరింతగా పెంచేసారు. ఏడున్నర పదులు వయసు కూడా జస్ట్ ఒక నంబర్ గానే బాబుకు వుంది అంటున్నారు. నిజం చెప్పాలనంటే నవ యువకుల కంటే కూడా బాబు మరింత ఎక్కువగా కష్టపడుతున్నారు అని అంటారు.

**ప్రతీ రోజూ సభలే :**

చంద్రబాబు చేసే వరస పర్యటనలు చూసినా అయన బిజీ షెడ్యూల్ చూసినా ఎవరికైనా వామ్మో అనిపిస్తుంది. అయనకు అలుపు ఉండదా లేక ఆయన అన్నింటికీ అతీతమా అన్న సందేహాలు కూడా వస్తాయి. దేశంలో ఏ నాయకుడూ చేయనన్ని పర్యటనలు బాబు చేస్తున్నారు అంటే గ్రేట్ అనుకోవల్సిందే. ఒకే రోజు రెండు మూడు పర్యటనలు కూడా చేస్తూ బాబు ఆదరగొడుతున్నారు. ఈ విషయంలో బాబుని ఎంతైనా మెచ్చాల్సిందే అని అంటున్నారు.

**బాబుకు సరిసాటి బాబే :**

అవును ఇదే అంతా అంటున్నారు. బాబు ఎనర్జీ లెవెల్స్ ని కానీ అయన స్పీడ్ ని కానీ బ్యాలెన్స్ చేసే వారు ఎవరూ లేరనే అంటున్నారు. దేశంలో చూసినా ఇంతలా జనంతో కలియతిరిగే నాయకుడు లేనే లేరు అని చెప్పాలి. బాబుకు ఇంతటి సుదీర్ఘమైన రాజకీయ జీవితం ఊరకే అయితే రాలేదు. అంతా అయన రెక్కలు కష్టమే అని విశ్లేషించాలి. చేసిన పని జనం లో చెప్పుకోవాలి. నిరంతరం ఆశవాహ వాతావరణం కల్పించాలి. సమస్యలు అన్నీ ఎవరూ తీర్చలేరు. కానీ కనీసం ఆలకించాలి. నేను ఉన్నాను ఆని గట్టి భరోసా అయినా ఇవ్వాలి. అది ఉత్తమ నాయకుడు లక్షణం. బాబులో ఇవి నిండుగా మెండుగా ఉన్నాయి. అందుకే బాబుని అంతా తలచుకునేది. ఇతర నాయకులు కూడా ఆయనను స్ఫూర్తి గా తీసుకుంటే వారి రాజకియం కూడా రాణిస్తుంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రేవంత్ హామీ.. అసెంబ్లీలో ఆసక్తికర చర్చ




తెలంగాణ అసెంబ్లీలో మున్సిపల్, పంచాయితీ రాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా బీసీ రిజర్వేషన్ల అంశం ఒక ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈ చర్చలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. గంగుల కమలాకర్ తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేర్చాలని, దీనివల్ల కోర్టుల నుంచి రక్షణ లభిస్తుందని సూచించారు. "జయలలిత మాదిరి నిర్ణయాలు తీసుకోవాలి" అని ప్రభుత్వానికి సలహా ఇచ్చారు.

**సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు**

మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రసంగానికి స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గంగుల గారితో "పెద్దల ఒత్తిడికి భయపడొద్దు" అని, "ఎలాంటి ఇబ్బంది వచ్చినా నేనున్నా" అని భరోసా ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. మంచి ఉద్దేశంతో వచ్చిన బిల్లును విమర్శించడం సరికాదని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**కులగణన, రిజర్వేషన్లపై రేవంత్ స్పష్టత**

వందేళ్లలో జరగని కులగణనను తాము చేశామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ లక్ష్యం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమేనని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల బిల్లును అడ్డుకోవడమే కొన్ని పార్టీల ఉద్దేశమని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. బలహీన వర్గాల రిజర్వేషన్ల కోసం ఐదుసార్లు ప్రధానికి లేఖ రాసినా అపాయింట్‌మెంట్ రాలేదని ఆయన ఆరోపించారు. ఈ విధంగా, తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై జరిగిన చర్చ, అధికార, ప్రతిపక్షాల మధ్య ఆసక్తికర సంభాషణకు దారితీసింది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన భరోసా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి.

# ఆ తీర్పుతో ఊహించని గుర్తింపు: జస్టిస్ విక్రమ్‌నాథ్

దేశంలో జంతు హక్కులు, ప్రజా భద్రత అనే రెండు అంశాలను ఒకేసారి వెలుగులోకి తెచ్చిన కేసు "వీధి కుక్కల సమస్య." ఈ కేసు తీర్పుతో దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని సుప్రీంకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల కేరళలో జరిగిన నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిన్న చిన్న కేసులు కూడా సమాజంలో పెద్ద ప్రభావం చూపగలవని తన అనుభవం ద్వారా తెలిసిందని అన్నారు.

**ధర్మాసనం తీర్పుపై విమర్శలు**

ప్రారంభంలో సుప్రీం కోర్టు మరో ధర్మాసనం "ఎన్సీఆర్ పరిధిలోని అన్ని వీధి కుక్కలను ఎనిమిది వారాల్లో షెల్టర్లకు తరలించాలి" అని ఆదేశించగా, దానిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. జంతు ప్రేమికులు మాత్రమే కాకుండా, న్యాయవేత్తలు, సామాజిక కార్యకర్తలు కూడా దీనికి వ్యతిరేకంగా స్వరం ఎత్తారు. మానవుల భద్రతతో పాటు జంతువుల ప్రాణ రక్షణ కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్న వాదన బలంగా వినిపించింది.

**మానవ భద్రత.. జంతు సంక్షేమం**

ఈ వివాదాస్పద ఆదేశంపై పునర్విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. రేబిస్ లక్షణాలు గల కుక్కలు లేదా ప్రమాదకర ప్రవర్తన చూపిస్తున్న జంతువులను మాత్రమే నిర్బంధించాలని, మిగతావి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ తర్వాత తిరిగి వాటి పరిసరాల్లోనే వదిలిపెట్టాలని స్పష్టంచేసింది. ఈ తీర్పుతో మానవ భద్రతా కోణం, జంతు సంక్షేమ దృక్కోణం రెండింటికీ సమతౌల్యం కలిగింది.

**ఊహించని స్పందన**

జస్టిస్ విక్రమ్‌నాథ్ తన అనుభవాన్ని పంచుకుంటూ, ఈ తీర్పు వల్ల సాధారణ పౌరులతో పాటు జంతు ప్రేమికుల నుండి కూడా శుభాకాంక్షలు అందుతున్నాయని తెలిపారు. "ఇంత సింపుల్‌గా కనిపించిన కేసు, నాకు అంతటి పేరును తెస్తుందని ఊహించలేదు" అని ఆయన వ్యాఖ్యానించడం, న్యాయవ్యవస్థలోని ప్రతి నిర్ణయం ఎంత ప్రభావవంతమో ప్రతిబింబిస్తోంది.

**సమాజ సమతౌల్యం.. చట్టపరిరక్షణ**

ఈ కేసు ద్వారా ఒక ముఖ్యమైన సందేశం వెలువడింది %-% న్యాయ నిర్ణయం కేవలం చట్టపరమైన విషయమే కాదు, సమాజంలో సమతౌల్యం తీసుకురావడంలో కీలక సాధనం. వీధి కుక్కల సమస్య వంటి చిన్నదిగా కనిపించే అంశం కూడా మానవ హక్కులు, జంతు హక్కులు, ప్రజా ఆరోగ్యం వంటి విస్తృత చర్చలకు దారి తీస్తుంది. జస్టిస్ విక్రమ్‌నాథ్ తీర్పు న్యాయపరమైన దిశలో మాత్రమే కాకుండా, నైతిక విలువల పరంగా కూడా ఒక కొత్త దృక్కోణాన్ని సమాజానికి అందించింది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## డిప్రెషన్ లో ఉన్నప్పుడు ఏంతినాలి.. ఏం తినకూడదు..!

తిండిపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాదు మానసిక ఆరోగ్యాన్ని కూడా ఫుడ్ హ్యాబిట్సే డిసైడ్ చేస్తాయి. సంతోషం, బాధ, కోపం, డిప్రెషన్.. ఇలా ఎమోషన్ ఏదైనా సరే తినే ఫుడ్ తోనే లింక్ అయి ఉంటుంది బ్రెయిన్? కి, డైజెషన్ ట్రాక్? కి చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. డైజెషన్ ట్రాక్ లో కొన్ని బిలియన్ల సూక్ష్మ జీవులు ఉంటాయి. అవి పేగుల నుంచి బ్రెయిన్, మెసేజ్ పంపించే న్యూరోట్రాన్స్ మీటర్? ను తయారుచేస్తాయి. కడుపునిండా తిన్నప్పుడు ఆ న్యూరో ట్రాన్స్? మీటర్స్ పర్ఫెక్ట్ షేప్? లో ఉండి.. బ్రెయిన్? కు మెసేజ్ పంపుతాయి. దానివల్ల హెల్దీ బ్యాక్టీరియా రిలీజ్ అవుతుంది. అది డోపమైన్, సెరటోనిన్ అనే హ్యాపీ హార్మోన్లను రిలీజ్ చేస్తుంది. కానీ, నూడిల్స్, బర్గర్ లాంటి ఫాస్ట్? ఫుడ్స్ తింటే న్యూరోట్రాన్స్? మీటర్స్ షేప్ లో తేడా వస్తుంది. బ్రెయిన్? కి సరిగా మెసేజ్ అందదు. దానివల్ల మూడ్? స్వింగ్స్, ఏదో ఒకటి తినాలనిపించే ఆలోచనలు చుట్టుముడతాయి. కాస్త డిప్రెషన్లో ఉన్నప్పుడు అవి మరింత పెరుగుతాయి. అందుకే డ్రిప్రెషన్లో ఉన్నప్పుడు తినాల్సిన, తినకూడని ఫుడ్ ఏంటో ఫేమస్ న్యూట్రిషనిస్ట్ లు చెప్తున్నారు.

### ఏమేం తినాలి?

కాస్త ముభావంగా అనిపిస్తుంటే వాల్? నట్స్ తినాలి. వీటిల్లోని ఒమెగా -3 ఫ్యాటీ యాసిడ్స్ బ్రెయిన్ ఫంక్షనింగ్ ని సపోర్ట్ చేస్తాయి. డ్రిపెషన్ సింప్టమ్స్ ని తగ్గిస్తాయి. అలాగే ఒమెగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే అవిసె గింజలు. పాదరసం లేని సాల్మన్ ఫిష్, చియా సీడ్స్ తినాలి. వీటిల్లో ఉండే ఫోలేట్, మెలటోనిన్, విటమిన్-ఇ. యాంటీ ఆక్సిడెంట్స్ న్యూరోప్రొటక్టివ్ కాంపౌండ్స్ గా పనిచేసి డిప్రెషన్? ని కంట్రోల్ చేస్తాయి.

డిప్రెషన్లో ఉన్నప్పుడు బీన్స్ ని డైట్ లో పక్కాగా చేర్చాలి. వీటిల్లోని జింక్,

కాపర్, మాంగనీస్, సెలీనియం. విటమిన్-బి1, బి6, ఇ.కె లు షుగర్ లెవల్స్? ని కంట్రోల్ చేసి చే మూడ్ స్వింగ్స్ కి బ్రేక్ వేస్తాయి.

క్యాబేజీ పచ్చడి, పెరుగు, జున్నులాంటి ప్రో-బయోటిక్స్ ఎక్కువగా ఉండే ఫుడ్ తినడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడొచ్చు. అలాగే యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్, మెగ్నీషియం ఎక్కువగా ఉండే డార్క్ చాక్లెట్స్ తిన్నా మూడ్ స్వింగ్స్ దరిచేరవు. ఇవి మెనోపాజ్ మూడ్ స్వింగ్స్, ప్రి మెనుస్ట్రువల్ సిండ్రోమ్ ని కూడా కంట్రోల్ చేస్తాయి.


అన్ని రకాల కూరగాయలు, ధాన్యాల్లో హెల్దీ కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. ఇవి మైండ్?ని కామ్ చేస్తాయి. వీటిల్లోని సెరటోనిన్ అనే మూడ్ బూస్టర్ డిప్రెషన్ నుంచి బయటపడేస్తుంది. పసుపులో కొంచెం బ్లాక్ పెప్పర్ ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె లేదా నెయ్యి కలుపుకుని తాగినా బ్రెయిన్ డిజార్డర్స్ నుంచి బయటపడొచ్చు..

### ఇవి తినొద్దు

డిప్రెషన్ లో ఉన్నప్పుడు చక్కెర శాతం ఎక్కువగా ఉండే ఫుడ్ జోలికి అస్సలు వెళ్లకూడదు. మరీ ముఖ్యంగా వైట్ బ్రెడ్స్? కి దూరంగా ఉండాలి. ఇవి వెంటనే బ్లడ్? లో షుగర్ లెవల్స్? ను పెంచుతాయి. అలాగే కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీలు తాగకూడదు. ఇవి నిద్రని దూరం చేసి మూడ్ స్వింగ్స్ ని మరింత పెంచుతాయి. డిప్రెషన్? లో ఉన్నప్పుడు బ్యాలెన్స్ డైట్ ఫాలో అవ్వాలి

# మూడ్ మార్చేసే ఇంటీరియర్ డిజైనింగ్!

**మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంత సేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది.**



మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది. ఇదే పరోక్షంగా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందట! అందుకే నచ్చినట్లుగా ఇంటిని అలంకరించుకుంటే.. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు దూరమై హ్యాపీగా ఉండచ్చని పలు



అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి, ఇంటీరియర్ డిజైనింగ్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం రండి..

### గదిని బట్టి.. రంగులు!

ఇంటి అందాన్ని పెంచడంలో, మనసుకు ఆహ్లాదాన్ని అందించడంలో రంగులది కీలక పాత్ర! నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే.. అటు సౌకర్యంగా, ఇటు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే శరీరంలో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదలవుతుంది. తద్వారా సంతోషంగా ఉండగలుగుతాం. అయితే మనకు నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే సరిపోదు.. గది అవసరాల్నీ పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. పడకగదిలో రిలాక్సవుతాం.. కాబట్టి ఇక్కడ మనసుకు ప్రశాంతతను అందించే లేత రంగులు, అందులోనూ ముఖ్యంగా పేస్టల్ షేడ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. అదే కిచెన్‌లో పనిచేసే సమయంలో ఉత్సాహంగా, చురుగ్గా ఉంటేనే పనులు సమయానికి పూర్తవుతాయి. కాబట్టి ఈ గదికి ఎరుపు, ఆరెంజ్.. వంటి రంగులు నప్పుతాయంటున్నారు. ఇలా గది ప్రత్యేకతల్ని బట్టి రంగుల్ని ఎంచుకుంటే.. అది ఆటోమేటిక్‌గా మనసుపై సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

### 'బయోఫిలిక్ డిజైన్' తెలుసా?

ఇంటి అలంకరణ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. కొందరు తమ ఇల్లు మోడ్రన్‌గా ఉండాలని కోరుకుంటే.. మరికొందరు వింటేజ్ థీమ్‌ని ఎంచుకుంటుంటారు. అయితే ఎవరి ఇష్టాయిష్టాలెలా ఉన్నా.. బయోఫిలిక్ ఇంటీరియర్ ట్రెండ్ మాత్రం ఇటు ఆరోగ్యాన్నిస్తూనే, అటు మానసిక ప్రశాంతతను, సౌకర్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణం.. ఈ డిజైనింగ్ కోసం వాడే అలంకరణ వస్తువులన్నీ పర్యావరణహితమైన ఉత్పత్తులతో తయారుచేయడమే! చెక్క, మట్టి, ఓక్ చెట్టు బెరడు, రాటెన్ (ఇదో రకమైన కలప), ఉన్ని.. వంటి ప్రకృతి అందించే మెటీరియల్స్‌ని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటారు డిజైనర్లు. బయోఫిలిక్ ఇంటీరియర్‌లో భాగంగా ఇలా గృహాలంకరణ వస్తువులే కాదు.. ఇంట్లోనే గోడకు లేదంటే ఓ మూలన చిన్నపాటి గార్డెన్‌లా పచ్చదనాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రకృతి రమణీయతతో కూడిన ఆర్ట్‌వర్క్‌కి ఇంట్లో చోటివ్వడం.. వంటివీ దీని కిందకే వస్తాయి. ఈ తరహా ఫర్నిచర్/గృహాలంకరణ వస్తువులతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు తగ్గి.. ప్రశాంతత చేకూరుతుందని పలు అధ్యయనాల్లోనూ తేలింది.

### వెలుతురు..ఓఎక్కడెలా?

వెలుతురు కూడా మన మనసును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ సహజసిద్ధమైన లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందట! అయితే చాలామంది వేడిగా ఉందని, దుమ్ము వస్తుందని.. పగటి పూటే తలుపులు, కిటికీలు మూసేసి.. వెలుతురు కోసం లోపలి లైట్లను ఉపయోగిస్తుంటారు. కానీ పగటి పూట వచ్చే న్యాచురల్ లైటింగ్‌ని ఇలా అడ్డుకోకుండా పూర్తిగా ఆస్వాదించినప్పుడే మనసుకు సాంత్వన చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పగటి పూట తలుపులు, కిటికీలు తీసే ఉంచడం మంచిది. అవసరమైతే వాటికి పల్చటి కర్టెన్లు వేలాడదీస్తే.. వేడి, దుమ్ము బెడద లేకుండా ఉంటుంది.. ఇంట్లో వెలుతురు కూడా పడుతుంది. ఇక రాత్రి పూట ఇంట్లో ఉపయోగించే లైటింగ్ కూడా గది అవసరాల్ని బట్టి ఉండాలంటున్నారు నిపుణులు.

లివింగ్ రూమ్‌లో ఎక్కువ సమయం గడుపుతుంటాం కాబట్టి ఈ గదిలో ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటుచేసుకోవాలి. ఇక గోడలపై ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేములు, ఆర్ట్ వర్క్‌పై మినీ స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే గదికి అందమొస్తుంది.. మనసుకు ఆహ్లాదంగానూ అనిపిస్తుంది.

అదే పడకగదిలో లైటింగ్ ఎంత తక్కువగా ఉంటే మనసుకు అంత ప్రశాంతంగా ఉంటుందంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదువుకోవడానికి, వర్క్ చేసుకోవడానికి టేబుల్ ల్యాంప్స్‌ని ఉపయోగించచ్చు.

ఇక డైనింగ్ టేబుల్‌పై షాండ్లియర్/పెండెంట్ లైటింగ్ ఏర్పాటుచేసుకుంటే.. ఆ గదికి ఆ లైటింగ్ సరిపోతుంది. లైట్ల ఫోకస్ ఎక్కువగా లేకుండా ప్రశాంతమైన భావన కలుగుతుంది.

ఇక కిచెన్‌లోనూ లైటింగ్ ప్రకాశవంతంగా ఉండాల్సిందే! అయితే దీంతో పాటు క్యాబినెట్స్, అరల్లో స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే.. అక్కడి వస్తువులు సులభంగా వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.. కంఫర్టబుల్‌గానూ అనిపిస్తుంది. ఇది పరోక్షంగా మానసిక ప్రశాంతతనూ పెంచుతుంది.

### గోడలకు.. 'డోపమైన్' టచ్!

ఇంటి అలంకరణ అనగానే చాలామంది గోడల పైనే తమ దృష్టి కేంద్రీకరిస్తారు. తమకు నచ్చిన చిత్రాల్ని గోడలకు తగిలించడం లేదంటే చక్కటి వాల్ ఆర్ట్ వేయించుకోవడం, వాల్‌పేపర్‌ని అతికించుకోవడం.. ఇలా ఎవరి స్టైల్ వారిది! అయితే అందులోనూ 'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ (వాస్తవికతకు సంబంధం లేకుండా గీసే చిత్రకళ)', 'పర్సనలైజ్‌డ్ ఆర్ట్ (వ్యక్తిగత అభిరుచులు, జ్ఞాపకాలతో చిత్రాల్ని రూపొందించడం)'.. వంటివి మనసుకు ఎక్కువ సంతోషాన్ని, ప్రశాంతతను అందిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని 'డోపమైన్ డెకార్'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇలాంటి అలంకరణ వస్తువులతో గోడలకు హంగులద్దితే ఇటు ఇంటికి అందం తీసుకురావచ్చు.. అటు మనసునూ ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# వార్-2 ఎఫెక్ట్.. ఇక అవి ఆపేయాల్సిందే



జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ డెబ్యూ మూవీ 'వార్-2' అతడికి ఉత్తరాదిన మంచి ఫాలోయింగ్ తెచ్చి పెడుతుందని, మార్కెట్‌ను విస్తరిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు అభిమానులు. కానీ ఆ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దారుణంగా బోల్తా కొట్టింది. ఎన్టీఆర్‌కు తిరుగులేని ఫాలోయింగ్ ఉన్న తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ సినిమా ప్రభావం చూపలేకపోయింది. హిందీలో హృతిక్ స్టార్ పవర్ వల్ల ఓ మోస్తరుగా ఆడింది. ఇంకా థియేటర్లలో ఉన్నప్పటికీ.. ఈ సినిమా ఫైనల్ రిజల్ట్ డిజాస్టర్ అనడంలో సందేహాలేమే లేవు. ఓ భారీ, క్రేజీ ప్రాజెక్టుతో బాలీవుడ్లోకి తారక్ ఇవ్వాలనుకోవడం మంచి ఆలోచనే. యశ్ రాజ్ ఫిలిమ్స్, అయాన్ ముఖర్జీ, హృతిక్ రోషన్.. ఈ కాంబినేషన్ సూపరే. కానీ తారక్ ఎంచుకున్న జానర్, టైమింగ్ పెద్ద మైనస్ అయ్యాయి. యశ్ రాజ్ ఫిలిమ్స్ బేనర్ అంటే స్పై థ్రిల్లర్లకు కేరాఫ్ అడ్రస్. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్.. అంటూ ఒక కేటగిరీ పెట్టి మరీ వాళ్లు ఈ జానర్లో సినిమాలు తీస్తున్నారు. ఐతే ఏక్ థా టైగర్, వార్, పఠాన్ సినిమాల వరకు బండి బాగానే నడిచింది. ప్రేక్షకులు ఈ భారీ యాక్షన్ సినిమాలను బాగా ఆదరించారు. కానీ మొదట్లో కొత్తగా, ఎగ్జైటింగ్‌గా ఉన్నది ఏదైనా తర్వాత మొహం మొత్తడం మామూలే. కథలు మార్చకుండా ఇటు అటు తిప్పి భారీ యాక్షన్ జోడించి సినిమాలు తీస్తుండడంతో జనాలకు చిరాకు వచ్చేసింది. టైగర్-3 సినిమాను అలాగే తిరస్కరించారు. పాకిస్థాన్ నుంచి ఇండియాకు ముప్పు వాటిల్లడం.. హీరో రంగంలోకి దిగి శత్రు దేశం మిషన్‌ను భగ్నం చేయడం.. ఇలాంటి కథలు బాలీవుడ్లో లెక్కకు మిక్కిలి తెరకెక్కాయి. ఓవైపు యశ్ రాజ్ వాళ్లు, ఇంకోవైపు వేరే నిర్మాణ సంస్థలు ఇవే కథలు తీసి తీసి జనాలకు మొహం మొత్తేలా చేశారు. గత ఏడాది బడేమియా చోటేమియా, ఫైటర్ లాంటి సినిమాలు కూడా జనాల తిరస్కారానికి గురయ్యాయి. ఇలాంటి టైంలో 'వార్-2' సైతం అదే అరిగిపోయిన కథతో తెరకెక్కడం, రవ్వంతైనా కొత్తదనం లేకపోవడం, ఇలాంటి భారీ యాక్షన్ ఘట్టాలు చాలా సినిమాల్లో చూసి ఉండడంతో సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమాకు వచ్చిన ఫలితం చూశాక.. ఇక యశ్ రాజ్ వాళ్లు స్పై యూనివర్స్‌ను మూసేయక తప్పేలా లేదు.



సుప్రీత వార్డ్‌రోబ్ మీకు కావాల్సినవన్నీ



రెబా మోనికా జాన్ యొక్క ఫ్యాషన్ అలలు సృష్టిస్తోంది

## జాన్వీ మినీ స్కర్ట్‌తో గుండె జారి గల్లంతు..!

జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటి వరకు ఆమె నటించిన ఏ ఒక్క సినిమా కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకోలేదు. వందల కోట్ల వసూళ్లు సాధించిన సినిమాలు కూడా లేవు. హిందీలో ఈమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడుతూనే ఉన్నాయి. ఇటీవల కూడా ఈమె నటించిన హెూమ్ బౌండ్ సినిమా సైతం ఆశించిన స్థాయిలో అలరించలేదు. సాధారణంగా హీరోయిన్స్ వరుస సినిమాలతో ఫ్లాప్ ను చవిచూస్తే కెరీర్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. జాన్వీ కపూర్ మాత్రం ఇన్నాళ్లుగా ఫ్లాప్స్ పడుతున్నా కెరీర్‌లో ముందుకు సాగుతూనే ఉంది. బాలీవుడ్‌లో ఏడాదికి కనీసం ఒకటి రెండు సినిమాల చొప్పున విడుదల చేస్తూ వస్తుంది. ఇదే సమయంలో టాలీవుడ్‌లో దేవర సినిమాలో నటించింది, ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా వెంటనే పెద్ది సినిమాలోనూ ఎంపిక అయింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ సినిమాలో జాన్వీ నటించడం చాలా స్పెషల్‌గా చెప్పుకోవచ్చు.



**సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ అందాల ఆరబోత**

శ్రీదేవి నట వారసురాలిగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ తనకంటూ ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కించుకోవడం ద్వారా జాన్వీ కపూర్ ఇండస్ట్రీలో ఉండగలుగుతుంది. సినిమాలు హిట్ కాకున్నా జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోలు, వీడియోల కారణంగా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తద్వార జాన్వీ కపూర్ కు ఎప్పటికప్పుడు ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ఇండస్ట్రీలో చాలా మంది నటన ప్రతిభ, అదృష్టం, సినిమాలు హిట్ కావడం వల్ల వరుస సినిమాలు చేస్తున్నారు, కానీ జాన్వీ కపూర్ మాత్రం సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా పాపులారిటీ దక్కించుకుని సినిమా ఇండస్ట్రీలో కొనసాగుతుంది. ఈ విషయాన్ని ఆమె ఫ్యాన్స్ కూడా చాలా మంది ఒప్పుకుంటారు. జాన్వీ కపూర్ హిట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది.

**మినీ స్కర్ట్ లో జాన్వీ కపూర్ అందం**

తాజాగా జాన్వీ కపూర్ మరో వీడియో నెట్టింట వైరల్ అయింది. తాజాగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో జాన్వీ కపూర్ ఇలా పొట్టి డ్రెస్‌లో కనిపించింది. వైట్ కలర్ టీ షర్ట్ ధరించి, నడుము కొంత కనిపించే విధంగా చేసి, ఆరెంజ్ కలర్ మినీ స్కర్ట్ ధరించింది. విభిన్నమైన ఆ మినీ స్కర్ట్ వద్ద సన్నని వడ్డానంను సైతం పెట్టడంతో జాన్వీ కపూర్ చూపు తిప్పనివ్వడం లేదు. జాన్వీ కపూర్ ఇంత అందంగా ఉండటం వల్లే ఆమెకు వరుస ఆఫర్లు వస్తున్నాయి అంటున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ తన అందంతో స్టార్ హీరోయిన్స్‌కి పోటీగా నిలిచింది. ఇప్పుడు ఆమె మరింత అందంగా కనిపిస్తుందని, సినిమాల్లో హిట్స్ పడితే ముందు ముందు బాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్స్ లో ముందు వరుసలో నిలిచినా ఆశ్చర్యం లేదు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

**పరమ్ సుందరి రెయిన్ సాంగ్**

ప్రస్తుతం జాన్వీ కపూర్ పరమ్ సుందరి సినిమా ప్రమోషన్‌లో బిజీగా ఉంది. గత రెండు మూడు వారాలుగా పరమ్ సుందరి కోసం జాన్వీ కపూర్ ఎక్కని గడప లేదు, తొక్కని గడప లేదు అన్నట్లుగా ప్రమోషన్ చేస్తుంది. సిద్దార్థ్ మల్హోత్ర హీరోగా నటించిన పరమ్ సుందరి సినిమాకు ఇప్పటికే పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. పరమ్ సుందరి సినిమాలో ఉన్న భీగీ సారి పాట తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టి అటు మళ్లింది. యూట్యూబ్ ను షేక్ చేసిన ఆ పాట వెండి తెరపై చూస్తామా అని ప్రేక్షకులు అనుమానం వ్యక్తం చేశారు. తాజాగా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాలో ఆ పాట ఉందని తేలింది. ఆ పాట కారణంగా యూ/ఎ సర్టిఫికెట్‌ను ఇవ్వడం జరిగింది. ఆ పాట ఉంటే ఖచ్చితంగా మంచి ఓపెనింగ్స్ వస్తాయని అంతా విశ్వసిస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com